సత్యం, సమర్థత, విశ్వసనీయత
WWW.SAKSHYAM.COM
# సాక్ష్యం
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ | శుక్రవారం 19 జూన్ 2026
సంపుటి: 17 | సంచిక: 172
పేజీలు: 08 | వెల: రూ.2:00
Published from Hyderabad, Vijayawada.

## ఆధార్ కార్డు ఐడెంటిటీకి మాత్రమే పరిమితం చేయాలి

- పౌరసత్వం, నివాస ధృవీకరణ తదితరాలకు వాడరాదు
- పిటిషన్‌పై సుప్రీం సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు



న్యూఢిల్లీ,జూన్18(సాక్ష్యం): ఆధార్ కార్డు వినియోగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది ఆధార్ కార్డులను పౌరసత్వం, నివాసం, అడ్రస్ ధృవీకరణకు ప్రూఫ్ గా వాడుతున్నారని, ఇది కేవలం ఐడెంటిటీ వెరిఫికేషన్ కు మాత్రమే పరిమితం చేయాలని దాఖలైన పిటిషన్ ను విచారణకు చేపట్టిన సుప్రీంకోర్టు.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటను స్పందించాలని సుప్రీంకోర్టు కోరింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసం, న్యాయవాది అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్ పిటిషన్ ను

మిగతా 2 లో..



## నీట్ రీటెస్ట్ నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు

**వందతులను నమ్మొద్దని విద్యార్థులకు వినతి**

**21న రీ టెస్టు కోసం ఏర్పాట్లు పూర్తి: ఎన్‌టిఎ**

న్యూఢిల్లీ,జూన్18(సాక్ష్యం): నీట్-యూజీ రీటెస్టును పకడ్బందీగా నిర్వహించేందుకు విస్తృతమైన ఏర్పాట్లు చేసినట్లు 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ' ఎన్‌టిఎ తెలిపింది. విద్యార్థులు ప్రశాంతంగా ఉండి.. పరీక్ష సన్నద్ధతపై దృష్టి పెట్టాలని సూచించింది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 21న

మిగతా 2 లో..




## కొత్త డార్క్ వెబ్‌గా టెలిగ్రామ్ యాప్

**నేరగాళ్లకు అడ్డాగా మారిన మెసేజింగ్ ప్లాట్‌ఫామ్**

**కేంద్రప్రభుత్వం సంచలన ఆరోపణలు**

**ఢిల్లీ హైకోర్టుకు కేంద్రం నివేదిక సమర్పణ**

న్యూఢిల్లీ,జూన్18(సాక్ష్యం): మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ టెలిగ్రామ్‌పై కేంద్రం సంచలన ఆరోపణలు చేసింది. ఈ యాప్‌ను 'కొత్త డార్క్ వెబ్'గా పేర్కొన్న కేంద్రం.. ఇది నేరగాళ్లకు అడ్డగా మారిందని ఆరోపించింది.

మిగతా 2 లో..



## పవన్ కళ్యాణ్‌పై ఎందుకు కేసు పెట్టలేదు

**కేటీఆర్ సిరిసిల్లకు విజిటింగ్ టూరిస్ట్**

**టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత విమర్శలు**

కరీంనగర్,జూన్ 18 (సాక్ష్యం): ప్రాంతీయవాదాన్ని వేర్పాటువాదంతో పోల్చిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు కేసు పెట్టలేదని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)

మిగతా 2 లో..

# మూసీ నది ప్రక్షాళన చేసి తీరుతాం

## ఎవరు అడ్డుపడ్డా మూసీ ప్రక్షాళన కొనసాగుతుంది

## మూసీ మురికి కన్నా కల్వకుంట్ల విషం ప్రమాదం

- ప్రభుత్వ భూముల కబ్జా నిరోధానికే హైడ్రా
- పేదల జోలికి వెళ్లకుండా.. కబ్జాదారుల భరతం పడుతోంది
- హైదరాబాద్ కాలుష్యం నివారించేందుకే వనమహోత్సవం
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి
- గుర్రంగూడ ఎకో పార్క్‌లో వనమహోత్సవం
- మొక్కను నాటి ప్రసంగించిన సీఎం రేవంత్ రెడ్డి



**"ప్రజలు మురికిలోనే పొర్లాలని వాళ్లు భావిస్తున్నారు. ఎవరేమనుకున్నా మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం. సబర్మతి, యుమనా కంటే గొప్పగా మూసీ ప్రక్షాళన చేస్తాం. చెరువులు, నాలాలు ఆక్రమిస్తే వీపులకు సున్నం పెడతాం. ఎవరు అడ్డంపడి దొర్లినా, ఎండ్రిన్ తాగినా భారత్ ఫ్యూచర్‌సిటీ నిర్మిస్తాం. నగర అవసరాల కోసం 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్‌సిటీ నిర్మిస్తున్నాం."**

**-రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి**

రంగారెడ్డి,జూన్18(సాక్ష్యం): ఎవరైనా ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. కబ్జాలతో ప్రజలకు సమస్యలు రాకూడదనే హైడ్రా తీసుకువచ్చామని ప్రస్తావించారు. హైడ్రాను ఒక భూతంలా కొందరు చూపెడుతు న్నారని ధ్వజమెత్తారు. హైడ్రా పేదల జోలికి వెళ్లదని.. కబ్జాదారుల భరతం పడుతుందని స్పష్టం చేశారు. గుర్రంగూడ ఎకో పార్క్‌ను కబ్జా చేయాలని కొంతమంది చూశారని ఆరోపించారు. వనస్థలిపురంలో దేవుడి భూములనూ కూడా కబ్జా పెట్టారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం గుర్రంగూడ ఎకో పార్క్‌లో వన మహోత్సవం కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. హరిత నిధి ద్వారా నాగలింగం మొక్కను ముఖ్యమంత్రి నాటారు. రోబోటిక్ ఏనుగును ఆవిష్కరించారు. ఈ క్రమంలో గుర్రంగూడ ఎకో పార్క్ నమూనాను అటవీ

మిగతా 2 లో..

## మాదక ద్రవ్యాల నిర్మూలనకు చర్యలు

**నేడు ఎల్‌బి స్టేడియంలో విద్యార్థులతో ప్రమాణం**

**పాల్గొననున్న సిఎం రేవంత్, గవర్నర్ శుక్లా**




హైదరాబాద్,జూన్ 18 (సాక్ష్యం): తెలంగాణ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్యా వాతావరణం , మాదకద్రవ్యాల నిర్మూలనకు కట్టుబడి ఉందని మరోసారి చాటిచెబుతూ, జూన్ 19న శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్.బి. స్టేడియంలో రాష్ట్ర స్థాయి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనుంది. కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి గారు రెసిడెన్షియల్ విద్యాసంస్థల విద్యార్థులకు 'విద్యార్థి హక్కుల కిట్లు' పంపిణీ చేయనున్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, సంక్షేమం, వసతి సదుపాయాల కల్పనలో భాగంగా 20రకాల వస్తువులతో కిట్లు అందజేస్తున్నారు. కార్యక్రమంలో

మిగతా 2 లో..

# 30న రైతు భరోసా

- వానాకాలం సాగుకు రైతులకు అండగా ప్రభుత్వం
- 30న రైతు భరోసా నిధులు విడుదలకు సంసిద్ధం
- మధిర వేదికగా సిఎం చేతుల మీదుగా అందచేత
- ఏడు రకాల సన్నాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయం
- ధాన్యం కొనుగోళ్లలో కేంద్రం తీరుపై ఆగ్రహం
- కేబినేట్ భేటీలో పలు అంశాలపై సుధీర్ఘ చర్చ
- వివరాలు వెల్లడించిన మంత్రి ఉత్తమ్ కుమార్

**వానాకాలం రైతు భరోసా నిధులు విడుదల చేయాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ నెల 30న మధిరలో జరిగే భారీ బహిరంగ సభలో రైతు భరోసా నిధులు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఏడు రకాల సన్న రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని నిర్ణయించినట్లుగా వివరించారు. యాసంగి సీజన్‌లో సుమారు 80 లక్షల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపిన ఆయన, కేంద్రం మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని మంత్రుల సమావేశంలో డిమాండ్ చేసినట్లు వివరించారు.**



హైదరాబాద్,జూన్18(సాక్ష్యం): ఈనెల 30వ తేదీన రైతు భరోసా నిధులు విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశమైంది. ఈ సమావేశంలో ఈ మేరకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. వరుసగా తొమ్మిది రోజుల పాటు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం ఈ నిధులను జమ చేయనుంది. 30న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మధిరలో నిర్వహించే సభలో సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధులను విడుదల చేయనున్నారు. రైతు భరోసా కింద రైతులకు ప్రభుత్వం ఏటా ఎకరానికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తోంది. ఈ పెట్టుబడి సాయాన్ని రెండు పంటల కాలాలకు ఖరీఫ్, రబీ కాలంలో విడగొట్టి, ప్రతి సీజన్‌కు ఎకరాకు రూ. 6,000 చొప్పున నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. మరోవైపు.. 23వ ప్రధాన మంత్రి

మిగతా 5 లో..

## ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త

**11శాతం ఫిట్‌మెంట్ అమలుకు నిర్ణయం**

**జూలై 1 నుంచే అమలు చేస్తామన్న మంత్రి పొన్నం**



హైదరాబాద్,జూన్18(సాక్ష్యం): తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభవార్త చెప్పారు. ఆర్టీసీ సమ్మెలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులకు జులై 1 నుంచి 11 శాతం ఫిట్‌మెంట్ అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం టీజీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. నాగర్ కర్నూల్, పెద్దపల్లి బస్ డిపో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వేములవాడ,

మిగతా 5 లో..



## మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఉర్దూ అకాడమీ గోల్డెన్ జూబ్లీ వేడుకల వేళ ముషాయిరా
- వేగంగా రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణం
- కొత్త స్మశాన వాటికల స్థల సేకరణపై కలెక్టర్లకు ఉత్తర్వులు
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడి
- సమావేశానికి హాజరైన మంత్రి హజారుద్దీన్ కార్పొరేషన్ చైర్మన్లు

హైదరాబాద్,జూన్ 18 (సాక్ష్యం): రాష్ట్రంలోని మైనార్టీల సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందుకోసం బడ్జె ట్‌లో భారీగా నిధులను కేటాయించామని, వాటికి

మిగతా 5 లో..

## యూరియా యాప్ తొలగించాల్సిందే

**బిఆర్ఎస్ ఆధ్యర్యంలో ఆందోళన**

**ప్రభుత్వ తీరుపై మండిపడ్డ వేముల ప్రశాంత్ రెడ్డి**



నిజామాబాద్,జూన్18(సాక్ష్యం): యూరియా యాప్‌ను తక్షణం తొలగించాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా వేల్పూర్ ఎక్స్ రోడ్డు వద్ద బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆందోళనకు దిగారు. రైతులు, గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున ఈ నిరసన కార్యక్రమానికి హాజరయ్యారు. మాజీ మంత్రి నేతృత్వంలో జాతీయ రహదారిపై నేతలంతా కలిసి బైఠాయించారు. సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతుల ఉసురు పోసుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కొత్త తరహా యూరియా పంపిణీ వ్యవస్థను తీసుకువచ్చిందని ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. దుకాణాల్లో లేని యూరియా బస్తాలు యాప్ ద్వారా ఎలా రైతులకు అందుతాయని ప్రశ్నించారు.

మిగతా 5 లో..



## రామగుండం ఎరువులు మనకే కేటాయించాలి

**మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి**

హైదరాబాద్,జూన్ 18 (సాక్ష్యం): రామగుండం ఎరువులు పొందేలా కేంద్ర ప్రభుత్వంపై ఉద్యమిస్తామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వ్యాఖ్యానించారు. ప్రతి నెల రెండు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇస్తామని అన్నారని.. కానీ హామీ ఇచ్చిన మేరకు కేంద్రం యూరియా సరఫరా ఎందుకు చేయట్లేదని ప్రశ్నించారు. గురువారం సచివాలయంలో మీడియాతో మంత్రి తుమ్మల మాట్లాడారు. ఢిల్లీకి వెళ్లి సరిపడా యూరియా తెలంగాణకు ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతామని పేర్కొన్నారు. కేంద్రం ఎంఎస్పీ ప్రకటించి కొనుగోలు నుంచి తప్పుకుంటుందని మంత్రి తుమ్మల విమర్శించారు. ఒక్క గింజ మొక్కజొన్నని కూడా కేంద్రప్రభుత్వం ఎందుకు కొనలేదని నిలదీశారు. ఈ విషయాన్ని

మిగతా 2 లో..

# మూసీ నది ప్రక్షాళన చేసి తీరుతాం

మొదటిపేజీ తరువాయి..

అధికారులు.. సీఎంకి వివరించారు. ఎకో పార్క్‌లో రూ.35.50 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో రూ.17.84 కోట్లతో అభివృద్ధి పనులని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 2018లో కొందరి కుట్ర వల్ల కొడంగల్‌లో ఓడిపోయానని చెప్పుకొచ్చారు. ఇక తాను ఏమీ చేయలేనని కొందరు భావించారని అన్నారు. మల్కాజ్‌గిరి ప్రజలు తనను ఎంపీగా గెలిపించారని



తెలిపారు. ప్రశ్నించే గొంతు ఉండాలని నాడు ఎంపీగా తనను గెలిపించారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. తనను ఓడించాలని కొందరు ఎన్నో కుట్రలు పన్నారని ధ్వజమెత్తారు. ఇక్కడి ప్రజల అభిమానమే తనను ముఖ్యమంత్రిగా నిలబెట్టిందని వివరించారు. ఎల్బీనగర్ ప్రజలు తనకు 30 వేలకుపైగా ఓట్ల మెజారిటీ ఇచ్చారని అన్నారు. తన సొంతూరు కొండారెడ్డిపల్లి లాంటిదే తనకు ఎల్బీనగర్ అని అభివర్ణించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎల్బీనగర్ అభివృద్ధిని పట్టించుకోలేదని మండిపడ్డారు. సీఎంగా ఎల్బీనగర్ సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని మాటిచ్చారు. రంగారెడ్డి జిల్లాకు అన్నివిధాలా అండగా నిలుస్తున్నామని స్పష్టం చేశారు. కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాలుష్య కోరల్లో చిక్కుకుని ఢిల్లీ ప్రజలు బాధపడుతున్నారని సీఎం వ్యాఖ్యానించారు. మన హైదరాబాద్‌కు అలాంటి పరిస్థితి రావొద్దనే మొక్కల పెంపకాన్ని ప్రోత్సాహిస్తున్నామని వివరించారు. మూసీ పునరుజ్జీవం చేస్తామంటే కొందరు అడ్డుపడుతున్నారని ఆగ్రహించారు. మూసీ ఒడ్డున నివసిస్తున్న ప్రజలను తరలించి.. అభివృద్ధి చేస్తామంటే కొందరు మోకాలడ్డుతున్నారని మండిపడ్డారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీకి ప్రణాళికలు సిద్ధం చేశామని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ కడతామంటే మళ్లీ ఫార్మా కంపెనీలు తెస్తామంటున్నారని చెప్పుకొచ్చారు. ఫ్యూచర్ లేనివాళ్లు ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామంటున్నారని దుయ్యబట్టారు. ముందు సిద్దిపేట గెలిచిరండి.. ఆ తర్వాత రద్దుపై మాట్లాడదామని హితవు పలికారు. 60 శాతం గ్రీనరీ పెంచుతామంటే కేసులు వేశారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరేమనుకున్నా మూసీ నది ప్రక్షాళన చేసి తీరుతామని రేవంత్‌రెడ్డి అన్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ మేర ఈ పనులు చేపడతామని చెప్పారు. సబర్మతి, గంగా రివర్‌ఫ్రంట్‌ల కంటే మెరుగ్గా అంతర్జాతీయ స్థాయిలో దీన్ని తీర్చిదిద్దుతామన్నారు. కాలుష్య రహిత వాతావరణం ప్రజలకు ఇవ్వాలని ప్రయత్నిస్తున్నాం. నగర అవసరాల కోసం 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. ఫ్యూచర్ లేని నేతలు ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని చెబుతున్నారు. వాళ్ల ఫ్యూచర్‌ను ప్రజలు నిర్ణయిస్తే.. ఫాంహౌస్‌కు పరిమితమయ్యారు. ఫ్యూచర్‌సిటీని రద్దు చేస్తానన్న ఆయన ఈసారి సిద్దిపేటలో గెలవరు. కొందరు ఎన్జీటీలో కేసులు వేస్తున్నారు. మూసీలో కాలుష్యం కంటే.. కల్వకుంట్ల వాళ్ల కడుపులో కాలుష్యమే ఎక్కువ. ఎవరు అడ్డుపడినా అంతర్జాతీయస్థాయిలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించి తీరుతాం అని అన్నారు. కేసీఆర్ ఫ్యామిలీపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. గుర్రంగూడలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులను వర్చువల్ గా ప్రారంభించారు సీఎం రేవంత్. మూసీ పునరుజ్జీవం చేస్తామంటే అడ్డుపడుతున్నారని.. మూసీలో ఉండే కాలుష్యం కంటే కల్వకుంట్లోళ్ల కడుపులో విషం ఎక్కువని అన్నారు. మూసీ పునరుజ్జీవం వద్దంటున్న సుధీర్ రెడ్డి గతంలో మూసీ కార్పొరేషన్ చైర్మెన్ పదవి ఎలా తీసుకున్నారని ప్రశ్నించారు. భూకబ్జాలతో ప్రజలకు సమస్య రావొద్దని హైడ్రా తెచ్చామని... హైడ్రాను భూతంలా చూపిస్తున్నారని మండిపడ్డారు. హైడ్రా పేదల జోలికి వెళ్ళదని.. కబ్జాదారుల భరతం పడుతుందని అన్నారు. ఢిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకొని ప్రజలు ఇబ్బంది పడుతున్నారని.. మన హైదరాబాద్ కు ఆ పరిస్థితి రావొద్దని మొక్కల పెంపకం చేపట్టామని అన్నారు.

## సంపాదకీయం

### విద్యారంగంలో మార్పులు కావాలి !

తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభం ఒక గొప్ప ముందడుగనే చెప్పాలి. అందరికీ విద్య అన్నది ప్రభుత్వ పరంగా చేపట్టడం ఆహ్వానించదగ్గ విషయం. విద్య,వైద్యం విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటే ఓ ఐదేళ్లలో గణనీయమైన మార్పులు తీసుకుని రావచ్చు. గ్రామస్థాయి వరకు ప్రాథమిక విద్య, ప్రాథమిక వైద్యం అందితే ప్రజలకు అంతకు మించి కావాల్సింది లేదు. కులాలు, మతాల వారీగా హాస్టళ్లు, స్కూళ్ల వల్ల సమాజంలో అసమానాతలు పెరిగాయి. ఇదే విషయాన్ని పదేపదే ప్రస్తావిస్తున్న సిఎం రేవంత్ ఓ మంచి అడుగు వేశారనే చెప్పాలి. అయితే ఇదొక్కటే సరిపోదు. రేవంత్ రెడ్డి పదవీ కాలంలో రెండున్నరేళ్లు పూర్తయ్యాయి. ఇంకా రెండేళ్ల పదవీకాలం మాత్రమే ఉంది. కనీసం ఉన్న స్కూళ్లనయినా బాగుచేసి, హాస్టళ్లను స్కూళ్లకు అనుసంధానం చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టాలి. కెసిఆర్ హయాంలో కెజి టూ పిజి అని ప్రగల్భాలు పలికారు. కానీ దానిని ఏనాడు పట్టాలకు ఎక్కించలేక పోయారు. ఆనాడే చేసివుంటే పదేళ్లలతో తెలంగాణ విద్యావ్యవస్థ రూపురేఖలు మారి ఉండేవి. ఇప్పటికైనా కామన్ విద్యావిధానం తీసుకుని రావాలి. అందరికీ ఒకేచోట విద్యను తీసుకుని వస్తే ప్రైవేట్ స్కూళ్ల దోపిడీ కూడా తగ్గుంది. గ్రామాల్లో కూడా సామాన్య జనం నేటికీ అప్పులు చేసి పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారు. దీనిని తక్షణం నిరోధించాలి. ఈ దోపిడీని అరికట్టాలి. స్కూళ్లను అభివృద్ధి చేయడం వల్ల సమాజాంలో కులాల మధ్య అంతరాన్ని తొలగించడంతో పాటు, కుటుంబాల ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దవచ్చు. ప్రైవేట్ దోపిడీని అరికట్టవచ్చు. అలాగే ఏకీకృత విద్యకు కృషి చేయాలి. విద్యా వివక్షను రూపుమాపాలంటే కామన్ స్కూల్ విధానం వెంటనే అమలు చేయాల్సి ఉంది. తెలంగాణ పబ్లిక్ స్కూల్ కాన్సెప్ట్‌ను సిఎం తప్పనిసరిగా అమలు చేయగలిగితే అతిపెద్ద విజయం సాధించినట్లుగా చెప్పవచ్చు. అలా కాకుండా తెలంగాణ పబ్లిక్ స్కూల్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల పేరుతో ప్రభుత్వం ఎన్ని సంస్కరణలు ప్రవేశపెట్టినా లాభం ఉండదు. ఎంతగా డబ్బులు ఖర్చు చేసినా అత్యధిక విద్యార్థులున్న ప్రైవేటు విద్యా సంస్థలను నియంత్రించకుండా, ప్రభుత్వ బడులను సంస్కరించకుండా ముందుకు సాగితే సత్ఫలితాలు సాధించలేం. ప్రభుత్వ బడికి గతంలో ఉన్న ఇమేజ్ తీసుకుని రావాలంటే ప్రైవేటుకు దీటుగా ఉన్నాయన్న భరోసా కల్పించాలి. అందుకు గట్టి కృషి చేయాలి. నాణ్యమైన ఉచిత విద్య ప్రభుత్వ బడిలో దొరుకుతుందనే గట్టి నమ్మకం మాత్రమే ప్రభుత్వ విద్యా సంస్థలలో నమోదు పెంచుతుంది. కాబట్టి పాలకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే గ్రామాల వారీగా ఏకీకృత కామన్ పాఠశాల వ్యవస్థకు రూపకల్పన చేయాలి. అంతేగాక ఇబ్బడి ముబ్బడిగా కనీస వసతులు లేకుండా నడుస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలను నిషేధించాలి. లేదా నియంత్రణ చర్యలు చేపట్టాలి. ఇలా చేయగలిగితే సిఎం రేవంత్ ర ఎడ్డి ఆశించిన ఫలితాలు వస్తాయి. అంతరాలు లేని శాస్త్రీయ విద్య అందరికీ అందుబాటులోకి వస్తుంది. కామన్ స్కూల్ విధానం మాత్రమే ప్రజలకు ఏకైక విద్యా ప్రత్యామ్నాయంగా గుర్తించి ముందుకు సాగేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానం దోహదపడుతుంది. గ్రామాల్లో నర్సరీ నుంచి ఇంటర్ వరకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఒకే స్కూల్ ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలి. తెలుగు మీడియం అయినా ఆంగ్లబోధనను కూడా తప్పనిసరి చేయాలి. స్పోకెన్ ఇంగ్లీష్‌తో దీన్ని అధిగమించవచ్చు. ఇప్పుడు విద్యారంగానికి ఖర్చు చేస్తున్న నిధులతోనే ఏకీకృత విద్యను అందుబాటులోకి తీసుకుని రావచ్చు. గ్రామస్థాయి నుంచి పట్టణస్థాయి వరకు అందరి పిల్లలు ఒకే పాఠశాలలో చదువుకునే ఏకీకృత విధానం అమలు కావాలి. అక్కడే విద్యార్థులు బ్రేక్ ఫాస్ట్ మొదలు, మధ్యాహ్న భోజనం అందించాలి. ఇంటి నుంచి పిల్లలు స్కూలుకు వచ్చేలా అవసరమైతే ట్రాన్స్‌పోర్టు కూడా ఏర్పాటు చేయాలి. ఇది కుల, మత వైషమ్యాలు లేని విద్యా వ్యవస్థకు పునాది వేయగలదు. ఒక మండల కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ లాంటి స్కూల్ ఉంటే ఆ చుట్టుపక్కల విద్యార్థులంతా స్కూల్ బస్సుల్లో వచ్చి పోయేలా సౌకర్యాలు కల్పించాలి. దీనివల్ల పిల్లలు తల్లిదండ్రుల సమక్షంలోనే పెరగగలరు. హాస్టళ్లలో పడి బాల్యం కోల్పోకుండా చూడగలం. తల్లిదండ్రుల అజమాయిషీలో వారికి ఖర్చు లేకుండా అంతా ప్రభుత్వ కనుసన్నల్లో విద్యను నేర్చుకోగలరు. ఇలా కిలోమీటరు నుంచి ఐదు కిలోమీటలర్ పరిధి వరకు పిల్లలకు స్కూలును అందుబాటులోకి తీసుకుని రావడం ద్వారా సంక్షేమ హాస్టళ్ల బాధ తప్పుతుంది. ఇకపోతే ప్రత్యేక అవసరాలు గల మూగ, బధిర, అంధ బాలలకు మాత్రం ప్రత్యేకంగా పాఠశాలలను ఏర్పాటు చేసి, దానికి అనుబంధంగా మాత్రం హాస్టళ్లను కొనసాగించాలి. మానసిక ఎదుగుదల లేని పిల్లలు ప్రత్యేక అవసరాలు గల పిల్లలుగా గుర్తించినా, వారిని తల్లిదండ్రుల ప్రత్యేక పర్యవేక్షణ కిందనే ఉంచి, పాఠశాలల వసతులను కల్పించాలి. అభివృద్ధి చెందిన అమెరికా, బ్రిటన్ లాంటి దేశాల్లో సైతం ఏకీకృత పాఠశాల వ్యవస్థ ప్రభుత్వ రంగంలోనే విస్తృతంగా అభివృద్ధి చెందింది. మన దేశంలో నియంత్రణ, నియమాలు లేకుండా విచ్చలవిడిగా ప్రైవేటు పాఠశాల వ్యవస్థను అనుమతించడం వల్ల విద్యావ్యవస్థ వెర్రితలలు వేసింది. అవసరాలకు మించి ప్రైవేటు పాఠశాలల ఏర్పాటుతో ప్రభుత్వ పాఠశాల వ్యవస్థ దెబ్బ తింటోంది. తెలంగాణలో ఇప్పటికే నాలుగు వేల పాఠశాలలు మూతపడ్డాయని అంటున్నారు. 19లక్షల విద్యార్థులు ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుతుంటే, 36లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు విద్యా సంస్థలలో చదువుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. మనకు ఇంగ్లీష్ లేనిదే ముద్ద దిగదు. సామాన్యులు కూడా తమ పిల్లలు ఇంగ్లీషులో మాట్లాడాలని అనుకుంటారు. అందుకు ప్రభుత్వ స్కూళ్లలో స్పోకెన్ ఇంగ్లీష్ తప్పనిసరి చేయాలి. ఎల్‌కెజి నుంచే అది మొదలు కావాలి. మీడియం తెలుగు అయినా స్పోకెన్ ఇంగ్లీష్ ఉంటే పిల్లలు కూడా పెద్దయ్యాక బెరకు లేకుండా దూసుకు పోగలరు. ఇవన్నీ గమనించి విద్యారంగాన్ని పటిష్టం చేసే చర్యలకు అడుగులు వేస్తే విద్యారంగంలో విప్లవం సాధించగలం.

### నీట్ రీటెస్ట్ నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు

మొదటిపేజీ తరువాయి..

రీటెస్టు ఉంటుందని.. పరీక్ష వాయిదా పడుతుందన్న వదంతులను, సోషల్ మీడియా వేదికగా జరిగే దుష్ప్రచారాన్ని నమ్మొద్దని 'ఎక్స్' వేదికగా సందేశం విడుదల చేసింది. ఎన్‌టీఏ నుంచి వచ్చే అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని తెలిపింది. మరోవైపు.. పరీక్ష నిర్వహణపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అభ్యర్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే మే 3నాటి పరీక్షను రద్దు చేశాం. ఈ వ్యవహారం నుంచి పాఠాలు నేర్చుకుని పరీక్షా ప్రక్రియను మరింత బలోపేతం చేశాం. సంబంధిత మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, భద్రతా సంస్థల సమన్వయంతో పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేశాం. పటిష్ఠమైన, బహుళ అంచెల భద్రతా చర్యలు తీసుకుంటున్నాం. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. పరీక్ష సంబంధిత ఒత్తిడిని ఎదుర్కొంటున్న విద్యార్థులు 'మానస్' మానసిక ఆరోగ్య హెల్ప్‌లైన్ నంబర్‌ను (14416) సంప్రదించి సాయం కోరవచ్చని ఎన్‌టీఏ సూచించింది.పరీక్షకు ఇంకా మూడు రోజులే మిగిలి ఉన్నాయి. ఇప్పటికే సిద్ధమయ్యారు.. కాబట్టి అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడంపైనే దృష్టి పెట్టండి. ప్రశాంతంగా ఉండండి. బాగా విశ్రాంతి తీసుకోండి. మీ నుంచి ఇదే కోరుకుంటున్నాం అని అభ్యర్థులను ఉద్దేశించి ఎన్‌టీఏ పేర్కొంది. తల్లిదండ్రులు, అధ్యాపకులు కూడా.. విద్యార్థులను ప్రశాంతంగా ఉంచాలని, ధ్రువీకరించని సమాచారాన్ని వారితో షేర్ చేసుకోవద్దని విజ్ఞప్తి చేసింది. వారు స్థిరమైన మనసుతో, నిశ్చింతగా పరీక్షకు వెళ్లేలా చూడాలని సూచించింది. పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో మే 3నాటి నీట్-యూజీ పరీక్ష రద్దయిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది.



### మాదక ద్రవ్యాల నిర్మూలనకు చర్యలు

మొదటిపేజీ తరువాయి..

పాఠశాలలు, కళాశాలలను మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా విద్యార్థులతో కలిసి 'మాదకద్రవ్య రహిత పాఠశాలలు / కళాశాలలు' లక్ష్యంతో సామూహిక ప్రతిజ్ఞ చేయిస్తారు. ఈ ప్రతిజ్ఞ ద్వారా విద్యార్థుల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన పెంపొందించడం, నివారణ చర్యలను బలోపేతం చేయడం, విద్యాసంస్థల్లో సురక్షితమైన, ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన అభ్యాస వాతావరణాన్ని ప్రోత్సహించడం ప్రధాన ఉద్దేశ్యం. కార్యక్రమం లో దాదాపు 15వేల మంది విద్యార్థులు పాల్గొంటారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. వివిధ సంక్షేమ శాఖలు, విద్యా శాఖ సంబంధిత అధికారులకు కార్యక్రమ నిర్వహణకు అవసరమైన బాధ్యతలు కేటాయించబడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల సంక్షేమం, మాదకద్రవ్యాల నిర్మూలన, విద్యా రంగ బలోపేతానికి ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలవనుంది.

### ఆధార్ కార్డు ఐడెంటిటీకి మాత్రమే పరిమితం చేయాలి

మొదటిపేజీ తరువాయి..

విచారించింది. ఈ పిటిషన్ పై కేంద్ర ప్రభుత్వం, అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. ఆధార్‌ను ఐడెంటిటీ ప్రూఫ్ గా మాత్రమే వాడాలని పౌరసత్వం, నివాసం, అడ్రస్, పుట్టిన తేదీకి సంబంధించిన రుజువుగా వినియోగించకుండా కేంద్ర, రాష్ట్ర, ఎన్నికల సంఘాలకు ఆదేశాలు జారీ చేయాలని పిటిషన్‌లో కోరారు పిటిషనర్ అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్. ఓటరు నమోదుకు బర్త్ డేట్, రెసిడెంట్ ప్రూఫ్‌లకు ఆధార్ కార్డును వినియోగిస్తున్నారని, ఇది ఆధార చట్టానికి విరుద్ధమని పిటిషనర్ వాదించారు. ఆధార్ చట్టం, 2016లోని సెక్షన్ 9 'ఆధార్ పౌరసత్వానికి లేదా రెసిడెంట్ కు ప్రూఫ్ కాదని స్పష్టంగా తెలిపింది ఉడాయ్. అయినప్పటికీ, ఆధార్‌ను స్కూల్ అడ్మిషన్లు,ప్రాపర్టీ కొనుగోలు, బర్త్ ప్రూఫ్ రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ పొందడం కోసం వయస్సు, పౌరసత్వం, నివాస ధృవీకరణ పత్రంగా ఉపయోగించడమే కాకుండా, కొత్త ఓటరు నమోదుకు, పుట్టిన తేదీకి, నివాస ధృవీకరణ పత్రంగా కూడా వాడుతున్నారు. ఈ విధంగా, చొరబాటుదారులు, అక్రమ వలసదారులు ఆధార్‌ను ఉపయోగించి వివిధ డాక్యుమెంట్లను పొందుతున్నారని పిటిషన్‌లో కోర్టుకు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలలో ధృవీకరణ వ్యవస్థను సమగ్రంగా ప్రక్షాళన చేయాలని, సంస్కరణలను పర్యవేక్షించేందుకు విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తితో పాటు సైబర్ సెక్యూరిటీ, ఫోరెన్సిక్ నిపుణులతో కూడిన ఉన్నత స్థాయి పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో కోరారు.



### రామగుండం ఎరువులు మనకే కేటాయించాలి

మొదటిపేజీ తరువాయి..

తెలంగాణ రైతాంగంపై కక్ష అనుకోవాలా అన్నారు. కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు మంత్రుల బృందం ఢిల్లీకి వెళ్తామని స్పష్టం చేశారు. తొలకరి వర్షానికే విత్తనాలు వేస్తే రైతులు నష్టపోతారని చెప్పారు. రెండుసార్లు వర్షం పడితేనే సరిపడా తడి వస్తుందని.. అన్నదాతలు ఈ విషయాన్ని గమనించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇకపోతే రైతు



మరణించిన సందర్భంలో వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే రైతు బీమా పథకాన్ని ప్రభుత్వం అత్యంత బాధ్యతతో అమలు చేస్తోందన్నారు. ఎల్‌ఐసీకి చెల్లించాల్సిన మొత్తం వార్షిక ప్రీమియాన్ని ప్రభుత్వం ఇప్పటికే చెల్లించిందన్నారు. ల్గ÷తు బీమా పథకాన్ని నిలిపివేసినట్లు బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారం పూర్తిగా అసత్యమని మంత్రి తుమ్మల అన్నారు. రైతు సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులకు ఉపయోగపడే ఏ ఒక్క పథకాన్ని నిలిపివేసిన దాఖలాలు లేవని, పథకాలను నిలిపివేసి రైతులను ఇబ్బందులకు గురిచేసిన చరిత్ర గత ప్రభుత్వానిదే అని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం రైతులకు ఉపయోగపడే వ్యవసాయ యాంత్రీకరణ, సాయిల్ హెల్త్ టెస్ట్, సబ్సిడీపై విత్తనాలు వంటి పథకాలను నిలిపివేయడమే కాకుండా స్టేట్ వాటాను విడుదల చేయకుండా కేంద్ర ప్రాయోజిత పథకాలను సైతం రైతులకు దూరం చేసిందని విమర్శించారు. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఎలాంటి బేషజాలకు పోకుండా అమలు చేయడమే కాకుండా.. గత ప్రభుత్వం ఆపేసిన పథకాలను పునరుద్ధరిస్తూ రైతులకు అండగా నిలుస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదే అని పేర్కొన్నారు. మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 66,038 మంది రైతుల కుటుంబాలు రైతు బీమా పథకం ద్వారా లబ్ది పొందాయని మంత్రి తెలిపారు. ఆయా కుటుంబాల నామినీల ఖాతాల్లో మొత్తం రూ. 3301.90 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. 2023 డిసెంబర్ నుంచి ఆ ఏడాది ముగిసే వరకు 20,090 కుటుంబాలకు రూ.1,004.50 కోట్లు, 2024 సంవత్సరంలో 25,861 కుటుంబాలకు రూ.1,293.05 కోట్లు బీమా సాయంగా అందించినట్లు వివరించారు. 2025-26 సంవత్సరానికి రాష్ట్రంలో 42.16 లక్షల మంది రైతులు రైతు బీమా పథకంలో నమోదు చేసుకున్నారని, వీరందరికీ వర్తించేలా ఎల్‌ఐసీకి చెల్లించాల్సిన మొత్తం వార్షిక ప్రీమియం రూ.1,359.56 కోట్లను ప్రభుత్వం పూర్తిగా చెల్లించిందన్నారు. దీంతో 20,087 కుటుంబాలకు రూ.1004.35 కోట్లు బీమా సహాయంగా అంది, మరణించిన రైతు కుంటుబాలకు ఆర్థిక చేయూత అందించడం జరిగిందని అన్నారు. రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నాలు మానుకోవాలని మంత్రి హితవు పలికారు. రైతు మరణంతో దుఃఖంలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించి వారిని ఆర్థికంగా నిలదొక్క కొనే విధంగా రైతు బీమా పథకాన్ని ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని, రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

### పవన్ కళ్యాణ్‌పై ఎందుకు కేసు పెట్టలేదు

మొదటిపేజీ తరువాయి..

అధ్యక్షురాలు కవిత ప్రశ్నించారు. కేసు పెట్టడం చేతగాని ప్రభుత్వం తెలంగాణలో ఉందని విమర్శించారు. కరీంనగర్‌లో తెలంగాణ రక్షణ సేన జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఈ విషయాన్ని ప్రాధాన్యత లేని అంశంగా భావిస్తోందన్నారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక పలువురు నేతలు తెలంగాణ భావజాలంపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యమానికి అండగా నిలిచిన కరీంనగర్‌లో తెలంగాణ తల్లి విగ్రహం లేకపోవడం ప్రజల త్యాగాలను అవమాన పరిచినట్లేనని కవిత అన్నారు. ఇకపోతే మాజీమంత్రి




కేటీఆర్‌పై కల్వకుంట్ల కవిత షాకింగ్ కామెంట్స్ చేశారు. కేటీఆర్ సిరిసిల్లాకు వీకెండ్‌లో వచ్చి వెళ్లిపోతారని ఎద్దేవా చేశారు. సిరిసిల్లలో కవిత పర్యటించి. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ రైతన్నల నడ్డి విరిస్తే కేటీఆర్ ఎందుకు మాట్లాడట్లేదని ప్రశ్నించారు. సిరిసిల్లలో సెస్ ఆగమాగం అయితే కేటీఆర్ ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. రైతు డిస్కంలపై ఇప్పటి వరకు కేటీఆర్ ఎందుకు నోరెత్తలేదని కవిత ప్రశ్నల వర్షం కురిపించారు. రైతు డిస్కం కావాలో, వద్దో ఆయన ఎందుకు చెప్పలేదని నిలదీశారు. నేరెళ్లలో అక్రమ ఇసుక సంపాదన కోసం దళితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ధ్వజమెత్తారు. నేరెళ్ల బాధితులకు ఇప్పటి వరకు ఎలాంటి న్యాయం జరగలేదని చెప్పుకొచ్చారు. నేరెళ్ల ఇసుక బాధితుల తరపున కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కార్పొరేటర్‌గా వచ్చి.. నేరెళ్ల బాధితుల ఓట్లతో బండి సంజయ్ కేంద్రమంత్రి అయ్యారని కవిత పేర్కొన్నారు.

### కొత్త డార్క్ వెబ్‌గా టెలిగ్రామ్ యాప్

మొదటిపేజీ తరువాయి..

సైబర్ నేరగాళ్లు, అతివాదులు, డ్రగ్ ముఠా సభ్యులు చట్టం నుంచి తప్పించుకునేందుకు ఈ యాప్ ను ఎక్కువగా వినియోగిస్తున్నారని దుయ్యబట్టింది. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది. నీట్ రీఎగ్జామ్ నేపథ్యంలో దేశంలో టెలిగ్రామ్ వినియోగంపై కేంద్రం ఇటీవల తాత్కాలిక నిషేధం విధించిన సంగతి తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసు విచారణలో భాగంగా కేంద్రం గురువారం అఫిడవిట్ దాఖలు చేసింది. నీట్ యూజీ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా దుమారం లేపిన నేపథ్యంలో.. జూన్ 21న రీటెస్ట్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈ పరీక్షకు సంబంధించిన కొన్ని ముఠాలు టెలిగ్రామ్ వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ ఇటీవల దీనిపై కేంద్రం తాత్కాలిక నిషేధం విధించింది. ప్రశ్నపత్రాల లీకేజీ, తప్పుడు వార్తల వ్యాప్తిని నివారించేందుకు, మోసపూరిత నెట్‌వర్క్‌లను అరికట్టడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం తెలిపింది. జూన్ 22 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించింది. ఈ సందర్భంగా క్రిమినల్ నెట్‌వర్క్‌లు, అతివాద ముఠాలు, సైబర్ నేరగాళ్లు ఈ యాప్‌ను దుర్వినియోగం చేస్తున్న తీరును కేంద్రం అందులో వివరించింది. గోప్యతకు సంబంధించి టెలిగ్రామ్‌లో ఉన్న అధునాతన ఫీచర్లు క్రిమినల్ నెట్‌వర్క్‌లను ఎక్కువగా ఆకర్షిస్తున్నాయని పేర్కొంది. ఇందులోని ప్రైవసీ సెట్టింగ్‌లతో యూజర్లు తమ టెలిగ్రామ్ ఐడీలు, ఫోన్ నంబర్లు వంటి గుర్తింపు వివరాలను దాచిపెట్టేందుకు వీలు లభిస్తోంది. దీనివల్ల అసలు వ్యక్తులు ఎవరో గుర్తించడం దర్యాప్తు అధికారులకు కష్టంగా మారుతోంది. ఈ ఫీచర్ల వల్లే నేరగాళ్లు ఈ యాప్‌ను దుర్వినియోగం చేసి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, దోపిడీ, ఉగ్రదాడులు, మోసాలు వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇది కొత్త డార్క్ వెబ్‌గా మారింది. క్రిమినల్స్ డార్క్ వెబ్ లింక్‌లతో పరస్పరం అనుసంధానం చేసుకుంటున్నారు. దీంతో అధికారులు వారిని ట్రాక్ చేయలేక పోతున్నారని కేంద్రం తమ అ ఎ ి డ ె వి ట ్ లో ఆరోపించింది. ఇక, హింసాత్మక, తీవ్రవాదం, ఉగ్రవాద సంస్థలకు స ం బ ం ధి ం చి న కంటెంట్‌ను ప్రచారం చేయడానికి టెలిగ్రామ్ గ్రూపులు, ఛానెళ్లను ఉపయోగిస్తున్నారని కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. దీనివల్ల తప్పుడు సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతోందని, ఫలితంగా శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతోందని ఆరోపించింది. పిల్లలపై లైంగిక దాడుల వంటి దృశ్యాలను ఈ యాప్ గ్రూప్‌ల్లో విపరీతంగా షేర్ చేస్తున్నట్లు తెలిపింది. సైబర్ నేరగాళ్లు ఈ వేదికపై నకిలీ ఖాతాలను సృష్టించి.. ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని మండిపడింది. ఈ మెసేజింగ్ ఎ÷-లాట్‌ఫామ్ దుర్వినియోగంపై ఇటీవలి కాలంలో నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌కు ఫిర్యాదులు పెరిగినట్లు పేర్కొంది. హ్యాకర్ గ్రూప్‌లు కూడా ఈ టెలిగ్రామ్ ఛానళ్లను ఉపయోగించి పెద్ద ఎత్తున డేటా చౌర్యానికి పాల్పడుతున్నట్లు కేంద్రం తన అఫిడవిట్‌లో వెల్లడించింది. అంతేగాక, యూజర్ల వ్యక్తిగత డేటా అయిన మొబైల్ నంబర్లు, ఆధార్ వివరాలు, ఇతర సున్నితర సమాచారాన్ని యాక్సెస్ చేసేలా టెలిగ్రామ్ బాట్స్ పనిచేస్తుండటంపై కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మాధ్యమంలో పైరసీ సినిమాలు, వెబ్ సిరీస్‌లు, కాపీరైట్ కంటెంట్ కూడా ప్రసారమవుతున్న విషయాన్ని కేంద్రం కోర్టు దృష్టికి తీసుకెళ్లింది.



## సాయి మందిరంలో విశేష పూజలు, అన్నదానం

చైర్మన్ నల్లపాటి నరసింహారావు

కోదాడ జూన్ 18, (సాక్ష్యం)

కోదాడ మండలంలోని నల్లబండగూడెం గ్రామం రామాపురం క్రాస్ రోడ్డులో ఉన్న షిరిడీ సాయి బాబా మందిరంలో గురువారం సందర్భంగా ప్రత్యేక





పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై షిర్డీ సాయిబాబాకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నల్లపాటి నర్సింహారావు, అర్చకుడు సాయి శర్మ, సైదులు, సూర్యనారాయణ, సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

## శ్రమశక్తి అవార్డు అందుకున్న నాదెళ్ల బాలకృష్ణకి పౌర సన్మానం

కోదాడ, జూన్ 18 (సాక్ష్యం)

కోదాడ రూరల్ సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్, సత్యమేవ జయతే సేవా సమితి వ్యవస్థాపకులు నాదెళ్ల బాలకృష్ణ ప్రతిష్టాత్మక 'శ్రమశక్తి' అవార్డును అందుకున్న సందర్భంగా మండల పరిధిలోని రెడ్లకుంట గ్రామంలో గ్రామ ప్రజల





ఆధ్వర్యంలో గురువారం పౌర సన్మానం నిర్వహించారు. గ్రామ ప్రజలు శాలువా బొకేతో బాలకృష్ణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పొలంపల్లి కుటుంబరావు, ఉపసర్పంచి మల్లెల ప్రసాద్ రావు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంగవరపు లక్ష్మణరావు, విద్యుత్ శాఖ సిబ్బంది తిరుపతిరావు, శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు రామారావు, అంబరీష్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వృద్ధురాలిని చేరదీసిన లార్డు ఆశ్రమం

వరంగల్, జూన్ 18 (సాక్ష్యం):

గ్రేటర్ వరంగల్ నగరంలోని 22 వ డివిజన్ శాంతి నగర్ ప్రాంతంలో గత రెండు రోజులుగా గుర్తు తెలియని వృద్ధురాలు దుర్వాసనతో అనుమానస్పదంగా తిండి తిప్పలు లేకుండా దీన స్థితిలో ఉండడాన్ని గమనించిన కాలనీ వాసులు 22 వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బస్వారాజు కుమార్ స్వామిని సంప్రదించగా వారు లార్డు ఆశ్రమ నిర్వాహకులు డా. నారగాని నరేశ్ గౌడ్ కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఆశ్రమ నిర్వాహకులు రోడ్డుపై ఉన్న వృద్ధురాలిని చేరదీసి ఆమె వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేయగా కరీంనగర్ జిల్లా కేశవ పట్నం దగ్గర గద్దెపాక అని, మరొకసారి ఆంధ్ర అని, తనకు ఒక కూతురు ఉందని ఆమెకు పెళ్లి అయ్యి ఇద్దరు పిల్లలు ఉన్నారని, కూతురు అడ్రస్ తెలియదని, తన భర్త పెద్ద పోలీస్ ఇక్కడికి విమానంలో వచ్చానని పొంతన లేని సమాధానాలు పూర్తి స్పష్టత లేక పోవడం కొద్దిగా మానసికంగా ఇబ్బంది పడుతుంది. అనంతరం వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేయించి వరంగల్ మహా నగరపాలక సంస్థ మరియు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ల సౌజన్యంతో లార్డు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 1వ డివిజన్ పలివెల్పుల రోడ్డులో నిర్వహిస్తున్న నిరాశ్రాయుల ఆశ్రమానికి తరలించి ఆశ్రయం కల్పించారు. వృదురాలికి సంబందించిన వారు ఎవరైనా గుర్తిస్తే ఈ క్రింది నెంబర్లలో 7396507272 / 9849091501 సంప్రదించ గలరని తెలిపారు. ఈ కార్యక్రమం లో స్థానికులు మడిపెల్లి వేణు, పొన్న నాగరాజు, కడారి బుచ్చిరెడ్డి, తాటికొండ దామోదర్, ఎలుగం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.'



## విద్యుత్ షాక్ తలిగి ఇటుక బట్టి కూలి మృతి

మాడుగులపల్లి జూన్ 18 సాక్ష్యం:

మాడుగులపల్లి మండలంలోని గంద్రవానిగూడెం గ్రామంలో ఇటుక బట్టిలో విద్యుత్ షాక్ తగిలి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. మాడుగులపల్లి ఎస్ఐ ఎస్ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గంద్రవానిగూడెం గ్రామ శివారులో గురువారం బి.ఎం.కె ఇటుక బట్టిలో కూలి పని చేస్తున్న ఒరిస్సా కు చెందిన కార్తీక గౌడ,వయస్సు. 40 సం.,లు, అను వ్యక్తి నిద్ర లేచి తాను పెట్టుకున్న టేబల్ ఫ్యాన్ ను ఇంట్లో పెట్టడానికి వెళ్ళగా, ప్రమాదవశాత్తు కరెంటు షాక్ తగిలి స్పృహ తప్పి క్రింద పడిపోగా,అతని అన్న,చుట్టుపక్కల వారు చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రి మిర్యాలగూడ కు తరలించగా,డాక్టర్ పరిశీలించి అప్పటికే చనిపోయినారు అని నిర్ధారించినారు. మృతుడి తమ్ముడు పబిత్ర రౌత్ ఇచ్చిన పిర్యాదుపై, మాడ్గులపల్లి ఎస్సై క్రిష్ణయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంబించినారు.మృతినికి భార్య, ఇద్దరు పిల్లలు సంతానం కలరు.



## ప్రభుత్వ దిష్టిబొమ్మ ను దహనం చేసిన బీసీ సంఘం నాయకులు

మిర్యాలగూడ డివిజన్ జూన్ 18 (సాక్ష్యం న్యూస్)

నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణంలో ప్రైవేటు పాఠశాలలో ఫీజుల దోపిడీ అరికట్టాలని మిర్యాలగూడ లో బీసీ, ఎస్సీ ,ఎస్టీ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహం ఎదుట ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగిందని అన్నారు మిర్యాలగూడ పట్టణంలో విచ్చలవిడిగా విద్యా వ్యాపారం కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వ అధికారులు వారిపై చర్యలు తీసుకోకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థికంగా ఎంతో నష్టపోతున్నారని అడ్మిషన్ల , స్కూల్ ఫీజు, పుస్తకాలు, పేరిటవేలకు వేల రూపాయలు వసూళ్లు చేస్తున్న కూడా ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు ఎందుకు కట్టడి చేయడం లేదో అర్థం కాని పరిస్థితి ఉంది అన్నారు ప్రభుత్వం పేదల పక్షాన ఆలోచన చేసి ప్రైవేటు పాఠశాలలో ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేస్తే ఎంతోమంది నిరుపేదలు మధ్యతరగతి ప్రజలు పిల్లలు ఉన్నత చదువులు చదువుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎందుకు స్పందించట్లేదు మిర్యాలగూడలో అత్యధికంగా విద్యాసంస్థలు ఏర్పాటు చేసుకొని వారి ఇష్టానుసారంగా ఫీజులు నిర్వహించుకొని విద్యా వ్యాపారమే లక్ష్యంగా యాజమాన్యాలు డబ్బులు వసూళ్లు చేస్తుంటే కట్టడి చేయాల్సినటువంటి ప్రజాప్రతినిధులు ,విద్యాశాఖ అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారు .పేద ప్రజలు మధ్యతరగతి ప్రజలు చదువుకునేందుకు వీలుగా ప్రభుత్వం ఉండాలి కానీ పేదవానికి విద్య దక్కకుండా చేస్తున్న ఈ ప్రైవేటు యాజమాన్యాలకు మద్దతుగా ఉండకూడదని ఆయన అన్నారు మిర్యాలగూడలో ఫీజులు



కట్టడి చేయకుంటే మాత్రం విద్యాశాఖ అధికారుల కార్యాలయాలు ప్రజాప్రతినిధుల కార్యాలయాలు ముట్టడి చేస్తామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో.. మాల మహానాడు విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సురేష్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జక్కా నాగేశ్వరరావు, గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లావురి రవీందర్ నాయక్, బీసీ యువజన సంఘం జిల్లా కన్వీనర్ సిద్ధం రాజు, లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు సైదా నాయక్, బీసీ యువజన సంఘం పట్టణ నాయకులు పట్టేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై పాలకుల చిన్నచూపు

- జర్నలిస్టులకు మొండి చేయి చూపుతున్న ప్రభుత్వం
- ప్రభుత్వ ధోరణితో మూతపడనున్న చిన్న, మధ్య తరహా పత్రికలు
- రెండున్నర సంవత్సరాలుగా బిల్లులపై మొండివైఖరి
- ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు అక్రెడిటేషన్లు మంజూరు చేయాలి
- అక్రెడిటేషన్ కార్డుతో పాటు హెల్త్ కార్డులు అందించాలి
- రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్లస్థలాలు ఇవ్వాలి
- రెగ్యులారిటీ ఉన్న పత్రికలను ఎంపానల్మెంట్ చేయాలి
- జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అందించాలి
- ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలల్లో ఉచిత విద్య కల్పించాలి
- కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సదుపాయం కల్పించాలి
- ప్రతి జర్నలిస్టుకు ఉచిత బీమా పథకం ఏర్పాటు చేయాలి
- జర్నలిస్టులకు అన్యాయంచేస్తూ ప్రభుత్వం కాలయాపన
- ఫెడరేషన్ వ్యవస్థాపక, రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య
- పాలకులు వివక్ష చూపుతున్నారని జర్నలిస్టు నేత ఆగ్రహం
- డిమాండ్ల సాధనకై జర్నలిస్టుల "ఛలో హైదరాబాద్" నిర్వహణ
- గన్ పార్క్ వద్ద శాంతియుత నిరసన తెలిపిన జర్నలిస్టులు
- అడ్డుకున్న పోలీసులు.. అరెస్టులు.. పోలీస్ స్టేషన్ కు తరలింపు





హైదరాబాద్, జూన్ 18(సాక్ష్యం):

రాష్ట్ర ప్రభుత్వ వివక్ష, నిర్లక్ష్య వైఖరికి నిరసనగా,తమ డిమాండ్ల సాధనకై గురువారం జర్నలిస్టులు "ఛలో హైదరాబాద్"కార్యక్రమం నిర్వహించారు. గన్ పార్క్ నుంచి సచివాలయం ముట్టడికి బయలు దేరిన జర్నలిస్టులను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ఇచ్చిన "ఛలో హైదరాబాద్" పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల నుంచి తరలివచ్చిన జర్నలిస్టుల గన్ పార్క్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ వ్యవస్థాపక,రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య గన్ పార్క్ లోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద పూలు పెట్టి నివాళులర్పించారు.అనంతరం తెలంగాణ అమరవీరుల స్థూపానికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో పన్నెండేళ్ళుగా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా పాలకులు వివక్ష చూపుతున్నారని విమర్శించారు.తెలంగాణ కోసం తెలంగాణ జర్నలిస్టులు అన్న నినాదంతో తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన జర్నలిస్టులను పాలకులు చిన్నచూపు చూడడం దుర్మార్గమని ధ్వజమెత్తారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినప్పటికీ, జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం మొండి చేయి చూపుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. తెలంగాణలో అనేక చిన్న, మధ్య తరహా పత్రికలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని, రెండున్నర సంవత్సరాలుగా ప్రభుత్వం అడ్వర్టైజ్మెంట్స్ బిల్స్ ఇవడంలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్స్ వెంటనే ఇవ్వాలని, ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు అక్రెడిటేషన్ కార్డుతో పాటు హెల్త్ కార్డు ఇవ్వాలని, గ్రేటర్ హైదరాబాద్ తో సహా రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్లస్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్ఎన్నె, పీఆర్జీఐ రిజిస్ట్రేషన్ తో రెగ్యులారిటీ ఉన్న పత్రికలను ఎంపానల్మేంట్ చేయాలని, జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు, కళాశాలల్లో ఉచిత విద్యను అందించాలని, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రతి జర్నలిస్టుకు ఉచిత బీమా పథకం ఏర్పాటు చేయాలని, 60 సంవత్సరాలు దాటిన జర్నలిస్టులకు పెన్షన్లు ఇవ్వాలని, జర్నలిస్టుల సంక్షేమానికి బడ్జెట్ లో రూ.100 కోట్లు కేటాయించాలని, జర్నలిస్టుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన అనేక మంది జర్నలిస్టులు పాల్గొని ప్లకార్డులతో నినదించారు. అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించగా పోలీసులు వారిని అడ్డుకొని అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిని పంజాగుట్ట పోలీస్ స్టేషన్,ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ లకు తరలించారు. జర్నలిస్టుల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం నెరవేర్చకపోతే రాబోయే కాలంలో గత ప్రభుత్వాని పట్టిన గతే ఈ ప్రజా ప్రభుత్వానికీ పడుతుందని మామిడి సోమయ్య హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కో-కన్వీనర్లు బండి విజయ్ కుమార్, యాదగిరి, తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ చిర్రా శ్రీనివాస్, దామెర జగదీశ్వర్ గుప్తా, కే. పాండురంగారావు, పద్మనాభరావు, స్రామాట్ గుప్తా, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవి కుమార్, కో-కన్వీనర్లు ఆర్. శ్రీనివాస్ గౌడ్, సంతోష్ కుమార్, ఎం.రవికుమార్, సుభాష్, రేగటి వెంకన్న, ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నానబాల రామకృష్ణ, అర్వపల్లి నగేష్, మహబూబ్ నగర్ జిల్లా కార్యాధ్యక్షుడు గండేటి నర్సింహ, కార్యదర్శి గోపాల్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మధు, సూర్యాపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్వాయి జానయ్య, ముషం హరిప్రసాద్, వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జక్కుల విజయ్ కుమార్, స్వామిదాస్, పాలడుగు సురేందర్, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు దూమర్ల బాస్కర్, రంగారెడ్డి జిల్లా నాయకులు అశోక్ కుమార్ గౌడ్, పర్వతాలు, మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, గడ్డమీది అశోక్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## గనుల రంగంలో పారదర్శక సంస్కరణలు.. రాష్ట్ర ఆదాయ వృద్ధికి కొత్త దిశ: మంత్రి కొల్లు రవీంద్ర

సాక్ష్యం , విశాఖపట్నం

రాష్ట్రంలో గనుల రంగాన్ని పారదర్శకంగా, సాంకేతికత ఆధారంగా



అభివృద్ధి చేస్తూ ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేందుకు కూటమి ప్రభుత్వం సమగ్ర సంస్కరణలు చేపట్టిందని రాష్ట్ర ఎక్సైజ్, గనులు మరియు భూగర్భశాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. గురువారం సచివాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, గత ప్రభుత్వ హయాంలో అక్రమ మైనింగ్, ఇసుక దోపిడీ, అవినీతి కారణంగా రాష్ట్రానికి రూ.19,137 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు శ్వేతపత్రం ద్వారా వెల్లడించామని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఏపీ మైనర్ మినరల్ పాలసీ-2025 ఫలితంగా గత రెండేళ్లలో 1,700కుపైగా దరఖాస్తులు అందగా, 172 కొత్త మైనింగ్ లీజులు మంజూరై రాష్ట్ర ఖజానాకు రూ.172 కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. గనుల రంగంలో 262 శాతం వృద్ధి నమోదైందని తెలిపారు. అలాగే మేజర్ మినరల్స్ విభాగంలో 21 ఖనిజ బ్లాకులను వేలం వేసి 11 మైనింగ్ లీజులు, 10 కాంపోజిట్ లైసెన్సులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానం ద్వారా ఇప్పటివరకు 1.91 కోట్ల మెట్రిక్ టన్నుల ఇసుకను ప్రజలకు అందించామని, 412 ఇసుక రీచ్‌లు, 238 స్టాక్ యార్డులు ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ విధానం వల్ల నిర్మాణ వ్యయాలు దాదాపు 50 శాతం వరకు తగ్గి ప్రజలకు, గృహనిర్మాణదారులకు, నిర్మాణ రంగానికి ఊరటనిచ్చిందన్నారు. అక్రమ మైనింగ్, ఇసుక తవ్వకాల నియంత్రణ కోసం ఉపగ్రహ పర్యవేక్షణ, డ్రోన్ సర్వేలు, జీపీఎస్ ట్రాకింగ్, జీఐఎస్ మ్యాపింగ్ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను ప్రవేశపెట్టామని చెప్పారు. ఈ చర్యలతో రూ.3,500 కోట్లకు పైగా డిమాండ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలోని బీచ్ శాండ్ ఖనిజాల ఆధారంగా టైటానియం, రేర్ ఎర్త్ ప్రాసెసింగ్ పరిశ్రమలను అభివృద్ధి చేయడం ద్వారా రూ.20,000 కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉందన్నారు. అనంతపురం జిల్లాలోని జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్ట్ త్వరలో వాణిజ్య ఉత్పత్తి దశలోకి ప్రవేశించనున్నట్లు మంత్రి వెల్లడించారు. గనుల రంగంలో చేపట్టిన సంస్కరణల ఫలితంగా శాఖ ఆదాయంలో 32 శాతం వృద్ధి నమోదైందని, 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.3,500 కోట్ల ఆదాయ లక్ష్యాన్ని నిర్దేశించామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. రాష్ట్ర ఖనిజ సంపదను ప్రజల సంక్షేమానికి వినియోగిస్తూ ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఆదర్శవంతమైన గనుల రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

## ఓటర్ జాబితా ప్రజాస్వామ్యానికి పునాది రక్ష

- రాయపర్తి రైతు వేదికలో బీఎల్ఓలకు శిక్షణ
- ఎస్ఐఆర్ ఓటర్ జాబితా ప్రత్యేక సవరణపై అవగాహన
- తప్పులు దొర్లితే చర్యలు తప్పవు
- తహసీల్దార్ ముల్కనూరి శ్రీనివాస్

రాయపర్తి, జూన్ 18(సాక్ష్యం): ఓటర్ జాబితా ప్రజాసామ్యానికి పునాది రక్ష అని, ఒక్క ఓటు వృథా కాకూడదు ఒక్క అర్హుడు మిస్ కాకూడదు అని రాయపర్తి తహసీల్దార్ ముల్కనూరి శ్రీనివాస్ అన్నారు. గురువారం రాయపర్తి రైతు వేదికలో ఎస్ఐఆర్ ఓటర్ జాబితా ప్రత్యేక సవరణపై



బీఎల్ఓలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ ముల్కనూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటర్ జాబితాలో మరణించిన వారి పేర్ల తొలగింపు, 18 ఏళ్లు నిండిన కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, డూప్లికేట్ ఓట్ల గుర్తింపు వంటి అంశాలపై బీఎల్ఓ లకు దిశానిర్దేశం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో నిర్లక్ష్యం వహించ కుండా, ఇంటింటికి వెళ్లి పక్కాగా సర్వే చేయాలని తహసీల్దార్ సూచించారు. ఎస్ఐఆర్ ప్రత్యేక సవరణలో భాగంగా కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులు, మార్పులు చేర్పులపై బీఎల్ఓ లకు స్పష్టమైన ఆదేశాలు తహసీల్దార్ శ్రీనివాస్ జారీచేశారు. తప్పులు దొర్లితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, లోపాలు లేకుండా పూర్తి చేయాలని అధికారులకు తహసీల్దార్ ముల్కనూరి శ్రీనివాస్ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ చంద్రమోహన్, జీపీఓ లు , మండలంలోని బీఎల్ఓలు అందరూ తదితరులు పాల్గొన్నారు.

## చదువుల తల్లి మహేశ్వరికి చేయూత నిచ్చిన కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి

మిర్యాలగూడ డివిజన్ జూన్ 18 (సాక్ష్యం న్యూస్)

నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణం సీతారాంపురం కు చెందిన దనావత్ మహేశ్వరి రెడ్డికాలని బిటెక్ కేశవ మెమోరియల్ లో సిఎస్సి ఏఐఎంఎల్ లో ఫ్రీ సీటు సాధించింది. మహేశ్వరికి తండ్రి లేదు తల్లి కూలి పని చేసి




జీవనం సాగిస్తుంటుంది తినటానికి పూట గడవని పరిస్థితి చిన్నారి హైదరాబాదులో చదవాలంటే ప్రైవేట్ హాస్టల్లో ఉండి చదవాల్సిన పరిస్థితి. ఇటువంటి గడ్డు పరిస్థితిలో తెలంగాణ మట్టి మనిషి మేనేపల్లి పాండురంగా రావు మిర్యాలగూడ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకురాగా అమెరికాలో స్థిరపడినట్టువంటి ఎన్ఆర్ఐ గుమ్మితి నవీన్ రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి తో మాట్లాడి ఆమెకు ఏప్రిల్ నెల నుండి 2026-2027 ఎకడమిక్ ఇయర్ మొత్తానికి హాస్టల్ ఖర్చులకు ప్రతినెల 5,000 వేల రూపాయలు ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. గతంలో కూడా గుమ్మిత నవీన్ రెడ్డి పేదలకు లాప్టాప్లు వికలాంగులకు ట్రైసైకిల్ ఆటల పోటీలకు అనేక రకాలుగా మిర్యాలగూడ ప్రాంతంలో సహకారం చేయడం జరిగినది వారికి మహేశ్వరి కుటుంబ సభ్యులు మరియు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి పాండంగా రావు మరి కొంతమంది అభినందలు తెలియజేయడం జరిగినది వీరి చేతుల మీదగా వారి కుటుంబ సభ్యులులకు 5 వేల రూపాయలు అందజేశారు ఈ కార్యక్రమంలోతెలంగాణ మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు,చిన్నపంగ శ్రవణ్,నూకల వేణుగోపాల్ రెడ్డి తనయుడు శ్రీమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సేవ చేయడమే నిజమైన లయనిజం - లయన్ జిల్లా గవర్నర్ డా. చంద్రశేఖర్ ఆర్య

వరంగల్, జూన్ 18 (సాక్ష్యం):

లయన్స్ క్లబ్ అఫ్ వరంగల్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో లయన్ వంగరి వేణుగోపాల్ వింధ్య దంపతుల వివాహ వార్షికోత్సవము సందర్భంగా మీన, హేమ లత అను నిరుపేద మహిళల ఉపాధి కొరకు కుట్టు మిషన్ లు పంపిణి చేయడం జరిగింది. ముఖ్య అతిధిగా విచ్చేసిన జిల్లా గవర్నర్ లయన్ డాక్టర్ చంద్ర శేఖర్ ఆర్య సమక్షంలో కుట్టుమిషన్లు పంపిణీ చేసిన



అనంతరం ఆయన మాట్లాడుతూ లయన్ వంగరి వేణుగోపాల్ జిల్లా కు ఇలాంటి ఎన్నో కార్యక్రమాల చేసారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ స్పోర్ట్స్ చార్టర్ ప్రెసిడెంట్, పిఆర్సి లయన్ డాక్టర్ తాళ్ల రవి, మరియు పిఆర్సి లయన్ డాక్టర్ బైరి లక్ష్మి నారాయణ, అధ్యక్షులు లయన్ గుండేటి రమణయ్య, ఉపాధ్యక్షులు లయన్ పోశాల సురేందర్ గౌడ్, కోశాధికారి లయన్ కందకట్ల శ్రీధర్, ఉపాధ్యక్షులు లయన్ నాయిని అనిల్, లయన్ రావుల కనక రాజు, లయన్ వినోద్, డాక్టర్ రాధారాణి, వంగరి సంకీర్త్ పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భట్టు దేవానంద్‌కు ఏపీ హైకోర్టు న్యాయ సేవల కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు

సాక్ష్యం , విశాఖపట్నం

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భట్టు దేవానంద్‌ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయ సేవల కమిటీ చైర్మన్‌గా నియమించారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి ఎన్.వి. హరిబిందు వెల్లడించారు. ఈ నియామకానికి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఆంధ్రప్రదేశ్ గెజిట్‌లో ప్రచురించినట్లు తెలిపారు. జస్టిస్ భట్టు దేవానంద్ 1966 ఏప్రిల్ 14న కృష్ణా జిల్లా గుడివాడలో జన్మించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల నుంచి బి.ఎల్. పట్టా పొందిన ఆయన 1989లో న్యాయవాదిగా నమోదు అయ్యారు. విశాఖపట్నం జిల్లా కోర్టుల్లో న్యాయవాద వృత్తిని ప్రారంభించి, అనంతరం హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. ప్రభుత్వ న్యాయవాదిగా, బార్ కౌన్సిల్ సభ్యునిగా, పలు ప్రభుత్వ శాఖలకు న్యాయ ప్రతినిధిగా సేవలందించారు. 2020 జనవరి 13న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. 2023లో మద్రాస్ హైకోర్టుకు బదిలీ కాగా, 2025 జూలై 28న తిరిగి ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఈ నియామకం ద్వారా రాష్ట్రంలోని పేదలు, బలహీన వర్గాలకు న్యాయ సహాయం అందించే కార్యక్రమాల పర్యవేక్షణకు మరింత బలోపేతం కలుగుతుందని న్యాయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## యూరియా బుకింగ్ యాప్ ప్రారంభం - రైతులకు సులభతర సేవలు

నాగర్‌కర్నూల్, జూన్ 18: (సాక్ష్యం) రైతులకు యూరియా పంపిణీలో పారదర్శకత, సులభతర సేవల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన యూరియా బుకింగ్ యాప్‌ను జిల్లాలో ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి యాప్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఇకపై రైతులు తమ మొబైల్ ఫోన్ ద్వారా ముందుగానే యూరియాను





బుక్ చేసుకునే అవకాశం ఉంటుందని, దీంతో డీలర్ల వద్ద వేచి ఉండాల్సిన అవసరం తగ్గుతుందని అధికారులు తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం సుమారు 32 వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ వెల్లడించారు. యాప్ ద్వారా బుకింగ్ ఆధారంగా పంపిణీ చేపట్టడం వల్ల అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు అడ్డుకట్ట పడుతుందని పేర్కొన్నారు. రైతులకు యాప్ వినియోగంపై పూర్తి అవగాహన కల్పించాలని ఎమ్మెల్సీ అధికారులను ఆదేశించారు.

## అయినవోలు హుండీ ఆదాయం రూ.53.98 లక్షలు

### శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానంలో లెక్కింపు 78 రోజులకు రూ.53.98 లక్షల ఆదాయం

వర్ధన్నపేట, జూన్18(సాక్ష్యం): అయినవోలు శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానంలో గురువారం హుండీ లెక్కింపు నిర్వహించగా మొత్తం రూ.53,98,461 ఆదాయం వచ్చిందని దేవస్థాన ఈవో కందుల సుధాకర్ తెలిపారు. అయినవోలులో అయన మాట్లాడుతూ అయినవోలు శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానంలో గురువారం హుండీ లెక్కింపు కార్యక్రమం 30.03.2026 నుండి 18.06.2026 వరకు 78 రోజులకు గాను హుండీ, వివిధ ఆర్జిత సేవ టికెట్ల ద్వారా మొత్తం రూ.53,98,461 ఆదాయం సమకూరిందని ఈవో తెలిపారు.78



రోజులకు హుండీ ద్వారా రూ.9,98,694, ఆర్జిత సేవ టికెట్ల ద్వారా రూ.43,99,767, మొత్తం రూ.53,98,461 ఆదాయం వచ్చిందన్నారు. హుండీలో లభించిన మిశ్రమ బంగారం, వెండిని సీల్ చేసి హుండీలోనే భద్రపరచడం జరిగిందన్నారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమం దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ డివిజన్ పరిశీలకురాలు నందనం కవిత ఆధ్వర్యంలో నిర్వహించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్వహణ అధికారి కందుల సుధాకర్, చైర్మన్ కమ్మగొని ప్రభాకర్, ఐనవోలు పోలీస్ స్టేషన్ కానిస్టేబుళ్లు కనకస్వామి, పరమేశ్వరి, ధర్మకర్తల మండలి సభ్యులు, శ్రీ వెంకట అన్నమాచార్య సేవ ట్రస్ట్ కరీంనగర్ వారు, దేవాలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నగర్‌లో చోరీ.. బంగారం, వెండి అపహరణ

భూపాలపల్లి జూన్ 18 (సాక్ష్యం): మంజూనగర్ సమీపంలోని 9వ వార్డు శ్రీ వినాయక కాలని (వెంగళ రావు కాలనీ)లో దొంగలు బీభత్సం సృష్టించారు. కాలనీలో నివాసం



ఉంటున్న ఉపాధ్యాయుడు ముద్దమల్ల నరసింహస్వామి కుటుంబ సభ్యులు పనిమీద హైదరాబాద్‌కు వెళ్లిన సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఇంటి యజమాని మంగళవారం ఉదయం హైదరాబాద్‌కు వెళ్లి బుధవారం సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంట్లో వస్తువులు చిందరవందరగా కనిపించడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. ఆర్చ్ ద్వారం పక్కనున్న వెంటిలేషన్ కిటికీ స్క్రూలను తొలగించి ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు సుమారు 2 తులాల బంగారం, 35 తులాల వెండిని అపహరించినట్లు తెలిసింది. బాధితుడు పోలీసులకు సమాచారం అందించగా, ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో కాలనీవాసులు ఆందోళనకు గురయ్యారు. ప్రజలు,కాలనీ వాసులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

# 30న రైతు భరోసా

మొదటిపేజీ తరువాయి..

కిసాన్ యోజన పథకం సంబంధిత నిధులను కేంద్రం ఈ నెల 20న విడుదల చేయనుంది. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలోని తారకేశ్వర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. దీంతో ఒక్కో రైతు ఖాతాలో రూ. 2 వేలు చొప్పున నగదు జమ కానుంది. దీంతో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు 10 రోజుల తేడాతో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నాయి. సచివాలయంలో మంత్రులతో ప్రత్యేకంగా నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై ధాన్యాన్ని మాత్రమే తెలంగాణ కొనాలని నిర్ణయించామన్నారు. ఎరువుల కోటాను వెంటనే విడుదల చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై పలుమార్లు కేంద్రానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖలు రాశారని గుర్తు చేశారు. త్వరలో ఢిల్లీకి వెళ్లి ఆయా అంశాలను కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయించామన్నారు. రామగుండంలో తయారయ్యే యూరియాలో అత్యధిక శాతాన్ని తెలంగాణకే కేటాయించాలని కేంద్రానికి స్పష్టం చేశారు. అలాగే హైదరాబాద్ మెట్రో




సీఎం చర్చించారు. హైదరాబాద్ మెట్రో రైలు, ధాన్యం కొనుగోళ్లు, వీబీజీ రాంజీ పథకం, కేంద్ర ప్రభుత్వ వైఖరి తదితర అంశాలపై మంత్రులతో చర్చలు జరిపారు. వానాకాలం రైతు భరోసా నిధులు విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నామని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. జూన్ 30వ తేదీన మధిరలో రైతు సమ్మేళనం పేరిట నిర్వహించే బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులు విడుదల చేస్తారని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్ల సమావేశంలో వివరించారు. ఏడు రకాల సన్నాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామన్నారు.

మార్కెట్లో వాటికి ఉన్న డిమాండ్ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మన రాష్ట్రం నుంచి కేంద్రం తక్కువ ధాన్యం సేకరించడంపై ఈ సమావేశంలో ఆందోళన వ్యక్తమైందని పేర్కొన్నారు. మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని డిమాండ్ చేశామని తెలిపారు. కేంద్రం కనీస మద్దతు ధర ఇచ్చి కొనే విస్తరణకు కూడా సహకరించాలని కేంద్రాన్ని కోరారు. అందుకు మెట్రో రెండో దశకు అనుమతి ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఐఆర్ఎఫ్‌సీ నుంచి రావాల్సిన రుణాన్ని వెంటనే విడుదల చేయించాలని కేంద్రాన్ని కోరుతున్నట్లు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి అడ్డంకులు లేకుండా ప్రాజెక్టుల అనుమతులు ఇప్పించడానికి కలిసి రావాలని బీజేపీ ఎంపీలకు ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ పిలుపునిచ్చారు. ఇకపై డిజిటల్ క్యాబినెట్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. జూన్ 21వ తేదీన జరిగే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఈ కేబినెట్ భేటీలో నిర్ణయించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇక వీబీ-జీ ఆర్ఏఎం జీ పై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సబ్ కమిటీలో మంత్రులు సీతక్క, తుమ్మల, ఉత్తమ్ ఉంటారు. దీనిపై ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం తర్వాత.. జూన్ 25 లోపు ప్రభుత్వానికి కేబినెట్ సబ్ కమిటీ నివేదిక అందజేయనుందని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు.



# మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



మొదటిపేజీ తరువాయి..

సంబంధించిన అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన వేగవంతం చేస్తున్నామని ఆయన వెల్లడించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మైనార్టీల సంక్షేమం, వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శనివారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు. ఉర్దూ అకాడమీ స్వర్ణోత్సవాల సందర్భంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో ఉర్దూ సంస్కృతిని ప్రతిబింబించేలా పెద్ద ఎత్తున 'ముషాయిరా' (కవి సమ్మేళనాలు) నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఈ కార్యక్రమం నిర్వాహణకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలను అన్ని రకాల ఆధునిక హంగులు, వసతులతో నిర్మిస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 20 రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని, మరో 17 పాఠశాలలు నిర్మాణ దశలో ఉన్నాయని అధికారులు ఈ సందర్భంగా వివరించారు. దీనిపై భట్టి విక్రమార్క స్పందిస్తూ... అసంపూర్తిగా మిగిలిపోయిన మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల భవనాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. పనులు ఎక్కడా ఆగకుండా ఒక నిర్ణీత టైమ్ క్యాలెండర్‌ను రూపొందించుకుని, దాని ప్రకారమే పనులు పూర్తయ్యేలా పర్యవేక్షణ చేయాలని, మిగిలిన 17 పాఠశాల భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మైనార్టీ యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు మరియు వారిని ఆర్థికంగా నిలబెట్టడానికి రాజీవ్ యువ వికాసం' పథకం ద్వారా పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పథకం అమలు చేయడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమం కొరకు ప్రత్యేకంగా రూ. 50 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నిధులను క్రిస్టియన్ మైనార్టీ యువత స్వయం ఉపాధి రంగంలో రాణించడానికి తగిన ఆర్థిక ప్రోత్సాహం అందించడానికి కేటాయిస్తామన్నారు. మైనార్టీ సంస్థలకు సంబంధించిన విలువైన వక్ఫ్ మరియు ఇతర భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు తగిన చట్టపరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే, మైనార్టీల స్మశాన వాటికల చుట్టూ ప్రహరీ గోడల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఇందుకోసం తక్షణమే ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న జిల్లా, డివిజన్ కేంద్రాల్లో స్మశాన వాటికల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను సేకరించి కేటాయించాల్సిందిగా జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేయనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. హైదరాబాద్ నగరంలో జరగబోయే మొహర్రం వేడుకల సందర్భంగా, 9వ రోజున నిర్వహించే ప్రత్యేక కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ కోరగా.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించి, తప్పకుండా హాజరవుతానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ప్లానింగ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ గౌరవ ఉప్పల్, ఫైనాన్స్ సెక్రెటరీ సిక్తా పట్నాయక్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా, మైనార్టీ ÷నాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కోత్వాల్ ఉన్నారు.

# యూరియా యాప్ తొలగించాల్సిందే

మొదటిపేజీ తరువాయి..

యాప్ వల్ల గ్రామాల్లో రైతులు అనేక విధాలుగా ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. అందుకే యూరియా యాప్ తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా 'యూరియా యాప్ పోవాలి.. రేవంత్ దిగిరావాలి' అంటూ నినాదాలు చేశారు. రైతులకు తక్షణమే యూరియా అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైతులపై కక్ష సాధింపు చర్యలో భాగంగానే యూరియా యాప్ తెచ్చి రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సకాలంలో రైతుబంధు ఇవ్వక రైతులను ప్రభుత్వం నట్టేట ముంచుతుందని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతును రాజును చేసే ఘనత కేసీఆర్ కే దక్కిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుపై రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నా రేవంత్ సర్కార్ పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సకాలంలో రైతులకు ఎరువులు సకాలంలో పథకాలు అందించడంతోపాటు రైతు సంక్షేమం కోరిందని గుర్తు చేశారు.




## ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త

మొదటిపేజీ తరువాయి..

కథలాపూర్ బస్ స్టేషన్లకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. హుజూర్‌నగర్, కోదాడ, నాగర్‌కర్నూల్ బస్ స్టేషన్లకు కూడా మంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ములుగు బస్ స్టేషన్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మహాలక్ష్మి పథకంపై ప్రత్యేక అధ్యయనం చేయాలని సూచించారు. మహిళా సంఘాలకు చెందిన 553 బస్సుల పనితీరుపై మంత్రి నివేదిక కోరారు. రాష్ట్రంలో 1,050 ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణపై సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు. ఆర్టీసీ వద్ద 10,173 బస్సులు.. 38,128 మంది ఉద్యోగులు ఉన్నారని, రోజుకు 61 లక్షల



మంది ప్రయాణికులు టీజీఎస్ఆర్టీసీ సేవలు పొందుతున్నట్లు తెలిపారు. పెండింగ్ కారుణ్య నియామకాలను వెంటనే పూర్తి చేయాలని అధికారులను పొన్నం ఆదేశించారు. తొలగించిన ఉద్యోగుల్లో 244 మందికి ఇప్పటికే విధుల్లోకి అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. ఉద్యోగి శంకర్ కుటుంబానికి రూ. 1 కోటి చెక్కును ఆర్టీసీ అందజేయనున్నట్లు తెలిపారు. శంకర్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినట్లు చెప్పారు. దక్షిణ భారత రవాణా శాఖ మంత్రులతో త్వరలో ప్రత్యేక సమావేశం జరగనుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## బాలికపై అత్యాచారం నిందితుడికి 20 ఏళ్ల జైలు

### ములుగు పోక్సో ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు

### బాధిత బాలికకు రూ.10 లక్షల నష్టపరిహారం అందజేయాలని ఆదేశం

మంగపేట, జూన్ 18, (సాక్ష్యం) : బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి ములుగు పోక్సో ప్రత్యేక న్యాయస్థానం 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షను ఖరారు చేసింది. 2023లో మంగపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి ఎస్.వి.పి. సూర్య చంద్రకళ నిందితుడు కన్నెబోయిన సమ్మయ్య (35) దోషి అని నిర్ధారించారు. శిక్షతో పాటు నిందితుడికి రూ. 20 వేల జరిమానా, బాధితురాలికి రూ. 10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని తీర్పునిచ్చారు. కమలాపురం గ్రామానికి చెందిన నిందితుడు సమ్మయ్యపై అత్యాచారం, అపహరణ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మరియు పోక్సో చట్టాల కింద కేసులు నమోదయ్యాయి. ఈ కేసులో పోలీసులు పక్కా సాక్ష్యాలతో ఛార్జిషీటు దాఖలు చేయడంతో నిందితుడికి శిక్ష పడింది. కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన దర్యాప్తు అధికారి సిరిశెట్టి సంకీర్త్, డీఎస్పీ కిషోర్ కుమార్, ఎస్ఐ నాగరాజు, కోర్టు సీడీఓ మౌనికను జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్నాథ్ అభినందించారు. మైనర్ బాలలపై నేరాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, బాధితులకు న్యాయం జరిగే వరకు చట్టపరమైన పోరాటం కొనసాగిస్తామని ఎస్పీ స్పష్టం చేశారు.



## దిశ సమావేశం లో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు,అధికారులు

వరంగల్, జూన్ 18 (సాక్ష్యం) వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశానికి ముఖ్య అతిథులుగా శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు బలరాం నాయక్, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి పెండెం శ్రీలక్ష్మి, వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ శ్రీ పాలకుర్తి సారంగపాణి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్‌తో పాటు వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు హాజరయ్యారు.

## త్వరలోనే ఆర్‌పిఐ
# తెలంగాణ నూతన రాష్ట్ర కమిటీ

- రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో ఆర్‌పిఐ పార్టీ పోటీ
- రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియాజాతీయ కార్యదర్శి శివ నాగేశ్వరరావు



**హైదరాబాద్, జూన్ 18, ( సాక్ష్యం న్యూస్):** రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో రిపబ్లికన్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర జాతీయ కార్యదర్శి శివ నాగేశ్వరరావు అన్నారు. గురువారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శివ నాగేశ్వరరావు మాట్లాడుతూ... తెలంగాణలో బీజేపీ - ఆర్‌పిఐ కూటమి అత్యంత పటిష్టంగా ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. భాగ్యనగర జీహెచ్ఎంసీ మేయర్ పదవిని కైవసం చేసుకుని ఆ మేయర్ పీఠాన్ని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఒక అద్భుతమైన బహుమానంగా ఇస్తామన్నారు. అందుకోసం తెలంగాణ భారతీయ జనతా పార్టీ, తెలంగాణ రిపబ్లికన్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా పనిచేస్తున్నాయన్నారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి రామ్‌దాస్ అథవాలే రాబోయే ఆగస్టు నెలలో తెలంగాణ రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించనున్నారని తెలిపారు. ఈ పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్న ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కొంపెల్లి ప్రభుదాస్, పసుల రవి, గోరక్ సింగ్,, శ్రావణ్, సచిన్ గౌడ్, హనుమ ప్రసాద్, శివరాజ్, పీటర్, నాయుడు, స్నేహలత, గంగాపురం పద్మ రోజా తదితరులు పాల్గొన్నారు.

## డిపో మేనేజర్ సరస్వతిని
# ఘనంగా సన్మానించిన రాష్ట్ర అద్దె బస్సుల సంఘం



**నర్సంపేట జూన్ 18(సాక్ష్యం న్యూస్ ) :** నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నర్సంపేట డిపో మేనేజర్ సరస్వతి ని తెలంగాణ రాష్ట్ర అద్దె బస్సు యాజమానుల సంఘం ప్రతినిధులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువా కప్పి, పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అద్దె బస్సు యాజమానుల సంఘం గౌరవ అధ్యక్షులు లక్కం ప్రభాకర్ ఆధ్వర్యంలో నర్సంపేట డిపో పరిధిలోని అద్దె బస్సు యాజమానులు కలిసి డిపో మేనేజర్‌ను సన్మానించారు. అనంతరం అద్దె బస్సు యాజమానులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ సరస్వతి సానుకూలంగా స్పందిస్తూ, యాజమానుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అద్దె బస్సు యాజమానుల సంఘం అధ్యక్షులు నాగిశెట్టి ప్రసాద్, వినయ్ రెడ్డి, దినేష్, ఫర్వేజ్, భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అద్దె బస్సు యాజమానులందరూ నూతన డిపో మేనేజర్ సరస్వతి కి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆమె నాయకత్వంలో డిపో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

## మున్సిపల్ కార్మిక సిబ్బందికి
# డ్రైవర్స్‌కి కనీస వేతనం 26,000 ఇవ్వాలి



**నారాయణఖేడ్ జూన్ 18( సాక్ష్యం న్యూస్)** మున్సిపల్ కార్మికులకు డ్రైవర్లకు సిబ్బందికి పర్మిట్ చేయాలని సిఐటియు మున్సిపల్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద మొదటి రోజు రిలే నిరాహార దీక్ష నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు డివిజన్ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ నారాయణఖేడ్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు సిబ్బంది కి డ్రైవర్లు కు పెరిగిన ధరలకు అనుకూలంగా కనీస వేతనం 26,000 పెంచాలని రిటర్మేట్ బెనిపిట్ పింఛన్ ప్రమాద భీమా 5లక్షలు అమలు చేయాలనీ కొత్తగా వచ్చిన కార్మికుల పేర్లు ఆన్లైన్లో నమోదు చేసి ఈఎస్ఐ-పిఎఫ్ అమలు చేయాలని మున్సిపల్ లో చేస్తున్న కార్మికులందరికీ ఇండ్లు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని పట్టణ విస్తీర్ణంకు అనుకూలంగా వర్కర్లను డ్రైవర్లను నియమించారు ప్రస్తుతం ఇతర మున్సిపాలిటీలో డ్రైవర్లకు 19500 అమలు చేస్తున్నారని అదే మాదిరిగా నారాయణఖేడ్ మున్సిపాలిటీలో డ్రైవర్లకు ఎలక్ట్రిషన్ ఇతర సిబ్బందికి 19500 జీవితం ఇవ్వాలని ఆదివారం పండగల సమయంలో సెలవులు ఇవ్వాలని మున్సిపల్ లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి సభ్యులు సరుకులు ప్రతి నెల ఇవ్వాలని అన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు స్పందించి మున్సిపల్ కార్మిక సిబ్బంది యొక్క సమస్యల పరిష్కారం చేయకుంటే పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షురాలు శకుంతల చంద్రకళ సిద్ధమ్మ సాయమ్మ సుశీల బేబీ రవి సాయిలు రాజు సాయిలు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన సంక్షేమ వసతి గృహాలు పాఠశాలల
# నిర్వహణపై రూపొందించిన పాటల సిడిని
## ఆవిష్కరించిన ట్రైబల్ వెల్ఫేర్ డిడి గుగులోతు దేశీ రామ్ నాయక్



**మహబూబాబాద్ జిల్లా కరస్పాండెంట్ ( జూన్.18)** గిరిజన సంక్షేమ వసతి గృహాలు పాఠశాలల నిర్వహణపై రూపొందించిన పాటల సిడిని ఆవిష్కరించిన ట్రైబల్ వెల్ఫేర్ డిడి గుగులోతు దేశీ రామ్ నాయక్. మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న డైట్ మెనూ పాఠశాలల అభివృద్ధి కోసం అనేక సౌకర్యాలు కల్పిస్తుందని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ప్రత్యేక చొరవతో ప్రతినిత్యం క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేస్తూ విద్యార్థిని విద్యార్థులకు నాణ్యమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యా బోధనలను అందించడం జరుగుతుందని అన్నారు,గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యాసంస్థలలో ప్రవేశాలు పెంచడం కోసం కల్పిస్తున్న సౌకర్యాలను వివరిస్తూ హేమనుక ప్రభాకర్ , రేగ పాపయ్య, గట్టి శ్రీనివాస్, వై. వెంకన్న, తదితరులు స్వయంగా రచించి పాడి వివరించడం జరిగిందన్నారు,కావున జిల్లాలోని విద్యార్థిని విద్యార్థులు తమ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడిచే విద్యా సంస్థలలో చేరి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని దేశీ రామ్ నాయక్ అన్నారు.ఈ పాటల సిడి ఆవిష్కరణలో డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల 'చలో హైదరాబాద్' విజయవంతం

- - గన్‌పార్క్ వద్ద నిరసన తెలిపిన జర్నలిస్టులు
- నిరసనను అడ్డుకుని జర్నలిస్టులను అరెస్టు చేసిన పోలీసులు
- ప్రభుత్వ వైఖరిని ఖండించిన టిడబ్ల్యూజెఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య







**హైదరాబాద్, జూన్ 18, సాక్ష్యం :** రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల పట్ల అవలంబిస్తున్న వివక్ష, నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ( టిడబ్ల్యూజెఎఫ్ హెచ్ -2843 ) ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 'చలో హైదరాబాద్' కార్యక్రమం విజయవంతం అయ్యింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవస్థాపకుడు మామిడి సోమయ్య నాయకత్వం వహించగా రాష్ట్రం లోని అన్ని జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో జర్నలిస్ట్ లు హాజరైయ్యారు. ఈ నిరసన కార్యక్రమంలో భాగంగా జర్నలిస్టులు ముందుగా గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి, అనంతరం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు ఇళ్ల స్థలాలు, గృహాలు కేటాయించాలని, జర్నలిస్టుల పిల్లలకు కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఉచిత విద్య అందించాలని డిమాండ్ చేశారు. అలాగే కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సేవలు, ప్రతి జర్నలిస్టుకు ఉచిత బీమా పథకం, 60 ఏళ్లు దాటిన జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు.జర్నలిస్టుల సంక్షేమం కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయించడంతో పాటు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు హాజరయ్యారు. అనంతరం జర్నలిస్టులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. అయితే పోలీసులు ర్యాలీని అడ్డుకొని నిరసనకారులను అదుపులోకి తీసుకుని పంజాగుట్ట, ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్లకు తరలించారు.జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేకపోతే భవిష్యత్తులో మరింత ఉధృతమైన ఉద్యమాలకు సిద్ధమవుతామని మామిడి సోమయ్య హెచ్చరించారు.

## ఎస్‌బీఐ ఫౌండేషన్ సహకారంతో
# యువతకు సైనిక రంగంలో బంగారు భవిష్యత్

- నారాయణఖేడ్ సిఐ శ్రీనివాస్ రెడ్డి





**నారాయణఖేడ్. జూన్ 18( సాక్ష్యం న్యూస్)** మానూర్ మండలం రాయిపల్లి గ్రామంలోని యువత శిక్షణ కేంద్రం (వైటీసీ)లో శిక్షణ పొంది భారత సైన్యంలో ఎంపికైన 27 మంది యువకుల అభినందన సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నారాయణఖేడ్ సీఐ శ్రీనివాస్ రెడ్డి యువకులకు అభినందనలు తెలియజేస్తూ, మారుమూల ప్రాంతాల్లోని యువతకు నాణ్యమైన శిక్షణ అందించి దేశ సేవ చేసే అవకాశాలు కల్పిస్తున్న వైటీసీ సేవలు అభినందనీయమని అన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. మనూర్ ఎస్సై కోటేశ్వర్ రావు మాట్లాడుతూ, కేంద్రంలోని అభ్యర్థుల క్రమశిక్షణ, నేర్చుకునే తత్వం, భవిష్య భారత్ సంస్థ సభ్యుల సేవాభావం ఎంతో ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. మండల విద్యాధికారి రాజశేఖర్ షెట్కర్ మాట్లాడుతూ, దేశ రక్షణలో సైనికుల పాత్ర అమూల్యమని, సైన్యంలో ఎంపికైన యువత తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ దేశానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా భవిష్య భారత్ సంస్థ సభ్యులు మాట్లాడుతూ, ఇప్పటివరకు వైటీసీ ద్వారా 45 మంది యువకులు ఆర్మీ, పారామిలటరీ దళాల్లో ఎంపికయ్యారని, భవిష్యత్తులో మరింత మందిని దేశ సేవకు సిద్ధం చేసే లక్ష్యంతో శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. అనంతరం సైన్యంలో ఎంపికైన అభ్యర్థులు, అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సై కోటేశ్వర్ రావు, మండల విద్యాధికారి రాజశేఖర్ షెట్కర్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, నీలమ్మ, గ్రామ పెద్దలు ఖమరుద్దిన్, ఫజిల్ హుస్సేన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా
# మొక్క నాటి నీరుపోసిన జిల్లా కలెక్టర్, ఎస్పీ, డిఎఫ్ఓ





**మహబూబాబాద్ జిల్లా కరస్పాండెంట్ (జూన్.18)** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని జామండ్లపల్లిలో వన మహోత్సవం ప్రారంభం సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, ఎస్పీ డాక్టర్ శబరిష్, డిఎఫ్ఓ విశాల్ బత్తుల, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, లు మొక్కలు నాటి నీరు పోశారు,ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ వారికి కేటాయించిన మొక్కల లక్ష్యాలను చేరుకోవాలని పచ్చదనం, పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు, జిల్లాలో శాఖల వారీగా వన మహోత్సవం లక్ష్యాలు వ్యవసాయ 1లక్ష, 60 వేల మొక్కలు, బీసీ వెల్ఫేర్ 5వేలు, పంచాయతీరాజ్ 30 వేలు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ 31 లక్ష 40 వేలు , ఎక్సైజ్ 60 వేలు, ఫారెస్ట్ 4. లక్షల 50 వేలు, మెడికల్ అండ్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ 5 వేలు, హార్టికల్చర్ అండ్ సెరికల్చర్ 1 లక్ష 30 వేలు, పరిశ్రమల శాఖ 7 వేలు, ఇంటర్ కాలేజ్ ఎడ్యుకేషన్ 3 వేలు, ఇరిగేషన్ 11 వేలు, మైనారిటీ వెల్ఫేర్ 5 వేలు, మున్సిపల్ అథారిటీస్ 2. లక్షల 50 వేలు, పోలీస్ 60 వేలు, రోడ్లు భవనాల శాఖ 10 వేలు, పాఠశాల విద్యాశాఖ 15 వేలు, గిరిజన సంక్షేమ శాఖ ఐటీడీఏ 10 వేలు, మొత్తం 43 లక్షల 51 వేల మొక్కల లక్ష్యం పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు,నాటిన మొక్కల పెంపకం సంరక్షణలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ట్రీ గార్డ్, రక్షణ ఏర్పాట్లు చేయాలని, సమయానికి నీరు అందించాలని, ఎవెన్యూ ప్లాంటేషన్, మంకీ ఫుడ్ ప్లాంట్స్ ఏర్పాటు చేసి పండ్ల మొక్కలను నాటాలని, ప్రతి గ్రామపంచాయతీ, మున్సిపల్ పరిధిలో డిమాండ్కు అనుగుణంగా మొక్కలను పెంపకం చేపట్టి వెంటనే అందించాలని, సూచించారు.ఈ వన మహోత్సవం కార్యక్రమంలో ఫారెస్ట్ డివిజనల్ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా హార్టికల్చర్ అధికారి జినుగు మరియాన్న, ఫారెస్ట్ రేంజర్ అధికారి సురేష్, స్థానిక కౌన్సిలర్లు రజిత, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలు, వరదల పట్ల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్





**(సూర్యాపేట జిల్లా కరస్పాండెంట్ జూన్ 18):** రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కొనేందుకు జిల్లా అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. విపత్తు నిర్వహణ, సహాయక చర్యలపై అన్ని ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి శాఖ తమ బాధ్యతలను గుర్తించి, ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు వీలుగా జిల్లా యంత్రాంగం పటిష్టమైన కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. ముఖ్యంగా గత అనుభవాలు, జరిగిన నష్టాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి ముందస్తు ప్రణాళికతో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. భారీ వర్షాల పట్ల జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించలని, అదే విధంగా మండల స్థాయిలో రెవెన్యూ విభాగం తరపున తహశీల్దార్లు, డీపీఓలు, ఇతర అధికారులు బాధ్యత వహించాలని ఆదేశించారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల పరిధిలో లోతట్టు ప్రాంతాలు, వరద ముంపునకు గురయ్యే కాలనీలను, ఎక్కువ ఇళ్లు దెబ్బతినే అవకాశం ఉన్న ఏరియాలను ముందుగానే ఐడెంటిఫై చేయాలని సూచించారు. వరద బాధితులను తరలించేందుకు వీలుగా ప్రతి గ్రామంలోనూ ఎత్తైన ప్రాంతంలో ఉన్న కమ్యూనిటీ హాళ్లు, రీహ్యాబిలిటేషన్ సెంటర్లు, రైతు వేదికలను గుర్తించాలని, అక్కడికి వెళ్లేందుకు సరైన రహదారి సౌకర్యం, ప్రాథమిక వసతులు, నీరు, విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలవకుండా డీవాటరింగ్ పంపులను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, సహాయక చర్యల కోసం పోలీసు శాఖ సమన్వయం తీసుకోవాలని, విపత్తుల సమయంలో అగ్నిమాపక శాఖ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందని వారితో పాటు ఎస్డిఆర్ఎఫ్ బృందాలు కూడా సహాయక చర్యలకు సిద్ధంగా ఉంటాయని వివరించారు. రెస్క్యూ ఆపరేషన్లకు అవసరమైన రోప్స్, కట్టర్స్, లైఫ్ జాకెట్లు వంటి సామగ్రిని అందుబాటులో ఉంచాలని, అవసరమైతే తక్షణమే ప్రొక్యూర్మెంట్ చేసుకోవాలని ఫైర్ డిపార్ట్ మెంట్‌ను కలెక్టర్ ఆదేశించారు. భారీ వర్షాలు వరుసగా కురిసినప్పుడు పాత, శిథిలావస్థకు చేరిన ఇళ్లు, గోడలు కూలిపోయే ప్రమాదం ఉందని, గతంలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని, మున్సిపల్, గ్రామ పంచాయతీ అధికారులు అలాంటి భవనాలను గుర్తించి, అత్యవసర సమయాల్లో అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. చెరువులకు గండ్లు పడే అవకాశం ఉన్నందున వాటి కిందున్న ముంపు గ్రామాలను ముందే గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అత్యవసర సమయాల్లో అధికారులందరూ ఒకరికొకరు అందుబాటులో ఉండేలా కమ్యూనికేషన్ బుక్‌లెట్ రూపొందించాలని తెలిపారు. విపత్తు నిర్వహణలో భాగంగా అన్ని మున్సిపాలిటీలు, మండలాల్లో ముందస్తుగా మాక్ ఎక్సర్‌సైజ్ కండక్ట్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్ రాజ్, జడ్పీ సీఈఓ శిరీష, జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి, డిఎంహెచ్ఓ వెంకటరమణ, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

## ఎంపీపీఎస్ విద్యార్థులకు జోయాలుక్కాస్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగుల పంపిణీ

**ఉప్పల్,జూన్ 18 (సాక్ష్యం):** విద్యార్థుల విద్యావసరాలకు తోడ్పాటునందించే ఉద్దేశంతో జోయాలుక్కాస్ హబ్సిగూడ బ్రాంచ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్) విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. పాఠశాలలో 1వ తరగతి నుంచి 4వ తరగతి వరకు చదువుతున్న 100 మంది విద్యార్థులకు బ్యాగులను అందజేశారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి బ్యాగులో గొడుగు, వాటర్ బాటిల్, లంచ్ బాక్స్, పెన్సిల్ బాక్స్ తదితర సామగ్రిని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హబ్సిగూడ మాజీ కార్పొరేటర్ చైతన్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. విజయ్ కుమార్, జెడ్పీహెచ్ఎస్ హబ్సిగూడ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఉపేంద్ర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కార్పొరేట్ సంస్థలు సామాజిక



బాధ్యతలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అండగా నిలుస్తూ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం. సుజాత, ఎ. కల్యాణి, చి. అనిత, కె. శ్రీదేవి, కుమారి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు అవసరమైన వస్తువులతో కూడిన బ్యాగుల పంపిణీ పట్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

## వేలుపమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ

**(సాక్ష్యం)జయశంకర్ - భూపాలపల్లి, జూన్ 18 :** వేలుపమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ . గురువారం భూపాలపల్లి నియోజకవర్గంలోని మొగుళ్లపల్లి మండలం ఆకినపల్లి గ్రామంలో నిర్వహించిన వేలుపమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి వేలుపమ్మ అమ్మవారి ఆశీస్సులు పొందారు. గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలను పరిరక్షించడం ప్రతి



ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట రామ్ నర్సింహా రెడ్డి ,ప్రజాప్రతినిధులు,గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## జనసేనాని పర్యటనకు సహరించిన వారికి ధన్యవాదాలు

● జనసేన రాష్ట్ర నాయకులు గాదె పృథ్వీ

**హనుమకొండ, జూన్ 16 (సాక్ష్యం)** హనుమకొండ హనుమాన్ నగర్ కు చెందిన నిరంజన్ జన్యుపరమైన వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమితమై తన అభిమాన హీరో, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ను చూడాలని కోరిన విషయం పార్టీ శ్రేణుల ద్వారా తెలుసుకున్న జనసేనాని వెంటనే స్పందించి తానే స్వయంగా వచ్చి బుధవారం నిరంజన్ ను పరామర్శించారు. నిరంజన్ కోరినట్లు కుటుంబ సభ్యులతో నలభై నిమిషాలు గడిపారు. వారికి ఉపాధి కల్పించి జీవనోపాధి కల్పించేందుకు ఆర్థిక సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నిరంజన్ ఆరోగ్యం బాగుండాలని వరంగల్ భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసారు. పవన్ కళ్యాణ్ ను నిరంజన్ అడిగిన వెంటనే ఒక ట్యాబు,




ఇష్టపడిన ఒక కుక్క పిల్ల స్థానిక జనసేన నాయకుల ద్వారా రెండు గంటల్లోనే అందించారు. అయితే ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు సహకరించిన తెలంగాణ ప్రభుత్వ యంత్రాంగానికి వరంగల్ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రాజేంద్ర ప్రసాద్, గడ్డం రాకేష్, ఆమంచ సునీల్, దినేష్, కొలిపాక వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలి

● జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**(సాక్ష్యం) జయశంకర్ - భూపాలపల్లి, జూన్ 18:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు (ఎన్‌రోల్‌మెంట్) శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక ఫోకస్ పెట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. గురువారం ఆయన చిట్యాల మండలం చల్లగరిక గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్శనలో భాగంగా కలెక్టర్ పాఠశాలలోని అన్ని తరగతి గదులను, మధ్యాహ్న భోజన శాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి, వేసవి సెలవులు ఎలా గడిపారని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలు పునఃప్రారంభమైనందున విద్యార్థులంతా క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలని





పిలుపునిచ్చారు. పాఠశాలలో మౌలిక వసతులు, సౌకర్యాలు అద్భుతంగా ఉన్నప్పటికీ, విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉండటంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో హాజరు శాతాన్ని గణనీయంగా పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం చేస్తూ విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి జ్ఞానాన్ని పరిశీలించారు. విద్యార్థులంతా బాగా చదువుకుని, ఉన్నత విద్యావంతులుగా మారి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని విద్యార్థులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. విద్యా ర్థులలో పఠనాశక్తి పెంపొందించేందుకు లైబ్రరరీ పుస్త కాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. లైబ్రరరీ కార్డు నిర్వ హిం చాలని సూచించారు.

## లూస్ లైన్ బిగించారు ప్రజల గుండెల్లో ధైర్యం నింపారు

● ప్రమాదకరంగా వేలాడుతున్న 11 కెవి లైన్లను సరి చేసిన విద్యుత్ సిబ్బంది
● ప్రజల భద్రతే మా మొదటి ప్రాధాన్యత ● ఏడీఈ నటరాజ్

**రాయపర్తి, జూన్ 18(సాక్ష్యం):** రాయపర్తి మండలం లోని కాట్రపల్లి గ్రామ శివారులో ప్రమాదకరంగా వేలాడుతున్న 11 కె.వి లైన్లు, ఎల్.టి లూస్ లైన్లను విద్యుత్ సిబ్బంది సరి చేసి ప్రమాదం నుంచి కాపాడారు. గత కొన్ని రోజుల నుంచి ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ లూస్ లైన్లను విద్యుత్ సిబ్బంది గుంజి, బిగించారు. దీంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్ లైన్లు సాగి ప్రమాదకరంగా వేలాడుతే వర్షాకాలం దృష్ట్యా ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించిగా వెంటనే స్పందించిన వర్ధన్నపేట ఏడీఈ నటరాజ్, వెంటనే చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఏడీఈ ఆదేశాల మేరకు ఏఎల్ఎం శ్రీనివాస్, ఎండి అన్వర్, వెంకన్న, సురేందర్, రాజు, పురుషోత్తం తదితర విద్యుత్ సిబ్బంది గురువారం గ్రామంలో పర్యటించి, లూస్‌గా ఉన్న లైన్లను గుర్తించి గుంజారు. అవసరమైన చోట కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి లైన్లు బిగించారు. దీంతో ప్రమాదం తప్పినట్లైందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. లూస్ లైన్ల కారణంగా పిల్లలు, పశువులకు ప్రమాదం అని భయపడేవాళ్లం. ఏడీఈ నటరాజ్ వెంటనే స్పందించి లైన్లు బిగించడంతో ఇప్పుడు ధైర్యంగా ఉంది అని గ్రామస్థులు తెలిపారు.





**ప్రజల సేవలో విద్యుత్ శాఖ**

**- ఏడీఈ నటరాజ్**

ప్రజల భద్రతే మా మొదటి ప్రాధాన్యత అని, వర్షాకాలం నేపథ్యంలో లూస్ లైన్లు, ఒరిగిన స్తంభాలు ఉంటే వెంటనే 1912కు కాల్ చేసి తెలియజేయాలని ఏడీఈ నటరాజ్ అన్నారు. కాట్రపల్లి గ్రామంలో ప్రమాదకరంగా వేలాడుతున్న 11 కె.వి లైన్, ఎల్.టి లూస్ లైన్లను సరి చేసి ప్రమాదాన్ని తప్పించిన విద్యుత్ సిబ్బందిని ఏడీఈ నటరాజ్ అభినందించారు.

## యోగా సెంటర్ నిర్మాణంపై వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డ్ కీలక నిర్ణయాలు

**హనుమకొండ, జూన్ 18 (సాక్ష్యం)** వరంగల్ నగరంలోని హంటర్ రోడ్డులో 'ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డ్ డైరెక్టర్ల ముఖ్య సమావేశం జరిగింది. ట్రస్ట్ చైర్మన్, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ట్రస్ట్ బలోపేతానికి, సామాజిక సేవా కార్యక్రమాల విస్తరణకు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో పద్మశాలి విద్యార్థులకు అడ్మిషన్ల ఆమోదం, ప్రస్తుత అకాడమిక్ విద్యా సంవత్సరంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన అర్హులైన విద్యార్థులకు ట్రస్ట్ ద్వారా అడ్మిషన్లు కల్పించాలని బోర్డు ఏకగ్రీవంగా నిర్ణయించింది. పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ట్రస్ట్ అండగా ఉంటుందని చైర్మన్ వన్నాల శ్రీరాములు తెలిపారు.



నూతన యోగా సెంటర్ నిర్మాణం, ట్రస్ట్ భవనం పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో అత్యాధునిక యోగా సెంటర్‌ను నిర్మించాలని బోర్డు తీర్మానించింది. ఈ నిర్మాణానికి కావలసిన ఆర్థిక వనరుల కోసం స్థానిక ప్రజాప్రతినిధులు, దాతల నుండి నిధులు సేకరించాలని, ఇందుకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణను రూపొందించాలని నిర్ణయించారు. ఇతర సేవా కార్యక్రమాలపై చర్చ, చేనేత కార్మికుల సంక్షేమం, ట్రస్ట్ భవిష్యత్తు ప్రణాళికలపై సభ్యులు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ట్రస్ట్ బోర్డు వర్కింగ్ ప్రెసిడెంట్ వరంగల్ జిల్లా ప్రజాపరిషత్ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు, ట్రస్ట్ బోర్డ్ ప్రధాన కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది దాసరి ప్రేమ్ సాగర్, ట్రస్ట్ బోర్డు ఉపాధ్యక్షులు, పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు, వడ్నాల సదానందం, ట్రస్ట్ డైరెక్టర్లు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, సీనియర్ జర్నలిస్ట్ వేముల సదానందం నేత, ప్రముఖ క్యాన్సర్ వైద్యులు మంచికట్ల జనార్ధన్ లు పాల్గొన్నారు.

## సమగ్ర సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తాం: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, జూన్ 18 ( సాక్ష్యం బ్యూరో ) :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ విజయవంతం కావాలంటే రాజకీయ పార్టీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో బీఎల్ఓలతో సమన్వయం చేసుకుంటూ సహకరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా కోరారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులకు రాజకీయ నాయకులు సహకరించాలని కోరిన కలెక్టర్, బూత్ లెవెల్ అధికారులు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి అధికారులకు క్షేత్రస్థాయి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి వివరాలు సేకరిస్తారని తెలిపారు. 2002 ఓటర్ల జాబితాను ప్రాతిపదికగా తీసుకుని కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జూలై 24 నుంచి 30 వరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1,200 మంది ఓటర్లు ఉండేలా హేతుబద్ధీకరణ ప్రక్రియ చేపడతామని వివరించారు. జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించి, అభ్యంతరాల స్వీకరణ అనంతరం అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తామని తెలిపారు. ఎవరైనా తప్పుడు సమాచారం అందించినట్లయితే నేరుగా పేరు తొలగించకుండా, ముందుగా నోటీసు జారీ చేసి విచారణ నిర్వహించిన తర్వాతే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వలస వెళ్లిన వారు, మరణించిన వారు, డూప్లికేట్ ఓటర్లను గుర్తించి జాబితా నుంచి తొలగిస్తామని చెప్పారు. ప్రజాప్రాతినిధ్య చట్టం-1950లోని సెక్షన్-31 ప్రకారం ఓటర్ల జాబితాలో పేరు నమోదు కోసం ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం లేదా తప్పుడు డిక్లరేషన్ ఇస్తే ఒక సంవత్సరం జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రస్తుత జాబితాలో పేరు లేని కొత్త ఓటర్లు తప్పనిసరిగా ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అక్టోబర్ 1, 2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తయ్యే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మారిన వారు ఫారం-8 ద్వారా




దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని, సాయి బాబా (ఐఎన్‌సీ), యాద సత్యం (బీఆర్ఎస్), పి. రాజేందర్ రెడ్డి (బీజేపీ), ఎం.డి. అబ్దుల్ హాది, సాదతుల్లా (ఎంఐఎం), బి.డి. సామ్యూల్ (వైఎస్ఆర్‌సీపీ), వై. నర్సింహులు (బీఎస్పీ), ఎం. మురళి (టీడీపీ) తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ కేంద్రంలో ఇంటర్ డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలి

● అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి
● పాలకుర్తి, చెన్నూర్ రిజర్వాయర్ పనులను వెంటనే పూర్తి చేయాలి ● సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యేకి వినతిపత్రం

**పాలకుర్తి,జూన్ 18(సాక్ష్యం):** పాలకుర్తిలో ఇంటర్ డిగ్రీ కళాశాలలను ఈ విద్యా సంవత్సరంలోనే ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల సోమన్న, మండల కార్యదర్శి మాచర్ల సారయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యేని క్యాంపు కార్యాలయంలో కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని వారికి అందజేశారుఈ సందర్భంగా సోమన్న, సారయ్య మాట్లాడుతూ ...పాలకుర్తి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాల లేకపోవడంతో గ్రామీణ పేద విద్యార్థులు దూరప్రాంతాలకు వెళ్లి అధిక ఫీజులు కట్టలేక విద్యకు దూరమై పోతున్నారని ఆవేదనవ్యక్తంచేశారు. పాలకుర్తి నియోజకవర్గంలో పాలకుర్తి చెన్నూరు రిజర్వాయర్లను వెంటనే పూర్తిచేసి రైతాంగానికి సాగునీరు అందించాలని, గతంలో పలుమార్లు ఆందోళన



చేసినప్పటికీ ప్రభుత్వం హడావిడి మొదలు పెట్టింది తప్ప రిజర్వాయర్లను పూర్తి చేయడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు, వెంటనే రిజర్వాయర్ పనులు పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందించాలన్నారు. అర్హులైన పేదలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు రాజకీయాలకతీతంగా ఇవ్వాలని వారు కోరారు, నియోజకవర్గ కేంద్రమైన పాలకుర్తి లోనే ఇంటిగ్రేడ్ రెసిడెన్షియల్ స్కూలు ఏర్పాటు చేయాలని, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా పేద మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు పాఠశాల ఉపయోగపడుతుందని ప్రభుత్వం చెప్పిందని వారు గుర్తు చేశారు. వేలాది పేద బహుజన విద్యార్థులు చదువుకునేందుకు ఇక్కడే సౌకర్యాలు ఉండాలని కానీ మారుమూల మండలంలో స్కూలు పెట్టించే ప్రయత్నం ప్రచారం జరుగుతుందని దీనివల్ల పాలకుర్తి నియోజకవర్గం అభివృద్ధికి తీవ్ర ఆటంకం కలుగుతుందని కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పాలకుర్తి కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూలు ఇంటర్, డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని లేనియెడల ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు మాసంపల్లి నాగయ్య, ఏదునూరి మదార్, బెల్లి సంపత్, మూస్కు ఇంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## అమ్మ మాట - అంగన్‌వాడి బాటతో చిన్నారుల భవిష్యత్తుకు బాటలు

**మహబూబ్‌నగర్, జూన్ 18 ( సాక్ష్యం బ్యూరో ) :** మహిళా, శిశు, దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "అమ్మ మాట -- అంగన్‌వాడి బాట" కార్యక్రమం పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 13 నుంచి 19 వరకు జిల్లాలోని ప్రతి అంగన్‌వాడి కేంద్రంలో "అమ్మ మాట -- అంగన్‌వాడి బాట" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 3 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల పిల్లలను అంగన్‌వాడి కేంద్రాల్లో నమోదు చేయించి, వారికి నాణ్యమైన ప్రీ-స్కూల్ విద్య, పోషకాహారం, ఆరోగ్య సేవలు అందేలా చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అంగన్‌వాడి కేంద్రాల ద్వారా చిన్నారుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, స్వయం సహాయక సంఘాల మహిళలు, కమిటీ సభ్యులు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి అంగన్‌వాడి కేంద్రాల బలోపేతానికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, జిల్లా సంక్షేమ అధికారి ఎస్. జరీనా బేగం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. శ్రీనివాసులు, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.



## వెలుగని వీధి దీపాలు: పట్టించుకోని పాలకులు

**పాలకుర్తి,జూన్ 18(సాక్ష్యం):** జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. పాలకుల దృష్టికి తీసుకువెళ్లిన ప్రయోజనం శూన్యం. తక్షణమే అధికారులు స్పందించి వెలగని వీధి దీపాలు వెలిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



## ప్రభుత్వ బడి బతకాలంటే ప్రజల సహకారం ఉండాలి

● కాట్రపల్లి పాఠశాలలో ఘనంగా అక్షరాభ్యాసం

● విద్యార్థులకు స్వయంగా అక్షరాలు దిద్దించిన సర్పంచ్ రాపాక పద్మ బ్రహ్మచారి





**రాయపర్తి, జూన్ 18(సాక్ష్యం):** ప్రభుత్వ బడి బతకాలంటే ప్రజల సహకారం ఉండాలని గ్రామ సర్పంచ్ రాపాక పద్మ బ్రహ్మచారి అన్నారు. రాయపర్తి మండలం లోని కాట్రపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ రాపాక పద్మ బ్రహ్మచారి ముఖ్య అతిథిగా హాజరై, చిన్నారులకు స్వయంగా అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాపాక పద్మ బ్రహ్మచారి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేసి తల్లిదండ్రులపై భారం మోపుతున్నాయన్నారు. కానీ మన ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందిస్తున్నారన్నారు. తల్లిదండ్రులు ఆలోచించి పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలి అని సర్పంచ్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ ప్రభుత్వం నూతనంగా చేపట్టిన ఉచిత అల్పాహార కార్యక్రమం, సమతుల్య మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని తెలిపారు. మన ఊరి పాఠశాలను కాపాడుకోవాల్సిన బాధ్యత కాట్రపల్లి గ్రామ ప్రజలందరిపై ఉంది అని సర్పంచ్ అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి జాన్సీలక్ష్మి, కుమారస్వామి, సిఎచ్ శ్వేత, సాహెబున్నిసా ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యం అవసరం



**మహబూబ్‌నగర్, జూన్ 18 ( సాక్ష్యం బ్యూరో ) :** భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "నషాముక్త్ భారత్ అభియాన్ -- వికసిత్ భారత్ కి పహచాన్" కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17 నుంచి 26 వరకు జిల్లాలో నషాముక్త్ సప్తాహ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ "నషాముక్త్ భారత్ అభియాన్ -- వికసిత్ భారత్ కి పహచాన్" పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల వ్యక్తులు, కుటుంబాలు, సమాజం తీవ్రంగా నష్టపోతున్నాయని పేర్కొన్నారు. మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణం కోసం విద్యార్థులు, యువత, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు మరియు సామాన్య ప్రజలు చురుకుగా భాగస్వామ్యం కావాలని కోరారు. జిల్లాలో నిర్వహించే అవగాహన కార్యక్రమాల్లో విరివిగా పాల్గొని నషాముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయడంతో పాటు మత్తు పదార్థాల దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, జిల్లా సంక్షేమ అధికారి ఎస్. జరీనా బేగం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. శ్రీనివాసులు, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

## యాగమూర్తులకు హారతిస్తున్న పూజారి



**యాదగిరి కొండ సాక్ష్యం న్యూస్**
యాదగిరి పుణ్యక్షేత్రంలో గురువారం పంచనారసింహులను ఆరాధిస్తూ చేపట్టిన నిత్య పూజలు ఆలయ ఆచారంగా కొనసాగాయి. వేకువ జామున సుప్రభాతం చేపట్టిన పూజారులు గర్భాలయ ద్వారాలను తెరచి మూలవరులను హారతినిచ్చి కొలిచారు. పాలతో నిజాభిషేకం నిర్వహించాక, తులసి పత్రాలతో అర్చన చేపట్టారు. మహా ముఖమండపంలో అష్టోత్తరం, సువర్ణ పుష్పార్చన క్రతువులు కొనసాగించారు. ఉగ్ర నరహరిని శాంతింప జేసేందుకు శ్రీ సుదర్శన నా రసింహ హోమం నిర్వహించారు. లోక కళ్యాణార్థమై శ్రీ లక్ష్మీనరసింహస్వామి నిత్య కళ్యాణం ఆలయ ఆచారంగా చేపట్టారు. గజవాహనంపై సేవా పర్వాన్ని నిర్వహించారు. సాయంత్రం అలంకార జోడు సేవలు మంగళ వాయిద్యాలు, మంత్ర పటణాలతో మాడవీధులలో ఊరేగించారు. రాత్రి గర్భాలయంలోని స్వయంభూలను కొలుస్తూ ప్రత్యేక ఆరాధన జరిపారు. దర్బారు సేవోత్సవంలో నిత్య ఆదాయం వెల్లడించారు. దయాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం నిత్య అన్నదానానికి దాతలు వనస్థలిపురం వాస్తవ్యులు నారాయణ సుశీలమ్మ లక్ష రూపాయలు నగదు రూపేన ఆలయ అధికారులకు అందజేశారు.



## నాణ్యమైన విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యం: యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్, జూన్ 18 ( సాక్ష్యం బ్యూరో ) :** మహబూబ్‌నగర్ నగరంలోని బైపాస్ రోడ్ సమీపంలో నూతనంగా నిర్మించిన ఆర్కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో నాణ్యమైన విద్య ఎంతో అవసరమైందని అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల విద్యార్థులకు సమాన విద్యా అవకాశాలు కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆధునిక సదుపాయాలు, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యాసంస్థలు విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, ప్రతిభను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఆర్కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వంటి విద్యాసంస్థలు మహబూబ్‌నగర్ విద్యా రంగానికి కొత్త దిశను చూపించడంతో పాటు విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ విద్యార్థులకు అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపింది. ఆధునిక బోధనా విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం, సహపాఠ్య కార్యక్రమాల ద్వారా సమగ్ర విద్యను అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్ యాదవ్, పాఠశాల డైరెక్టర్లు రవి నాయక్, నర్సింహ, మనోహర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల భద్రతే లక్ష్యంగా ఆర్ఏఎఫ్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్

● శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ అత్యున్నత ప్రాధాన్యత: జిల్లా ఎస్పీ జానకి



**మహబూబ్‌నగర్, జూన్ 18 ( సాక్ష్యం బ్యూరో ) :** మహబూబ్‌నగర్ పట్టణంలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) బలగాలతో కలిసి భారీ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ దరావత్ జానకి పాల్గొని బలగాలను సమీక్షించారు. ఫ్లాగ్ మార్చ్ ఓల్డ్ డీఈవో కార్యాలయం, రైల్వే స్టేషన్, ఎర్రసత్యం క్రాస్ రోడ్, బోయపల్లి గేట్, తెలంగాణ చౌరస్తా, న్యూ బస్ స్టాండ్, మల్లికార్జున చౌరస్తా తదితర ప్రధాన ప్రాంతాల గుండా సాగింది. ప్రజా రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో పోలీసులు నిరంతరం అప్రమత్తంగా నిఘా కొనసాగిస్తున్నారనే భరోసాను ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో జీవించేలా జిల్లా పోలీసు యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, నేరాలను సమర్థవంతంగా అరికట్టడంతో పాటు ప్రజల్లో భద్రతా భావన పెంపొందించడమే ఫ్లాగ్ మార్చ్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రజా రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన ఎస్పీ, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. జిల్లాలో శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ ప్రజలతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తోందని, ప్రజల సహకారం పోలీసులకు ఎంతో కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇజాజుద్దీన్, ఆర్ఏఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్, ఆర్ఏఎఫ్ సిబ్బంది, పోలీసు అధికారులు, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

### వ్యాపార సంస్థల్లో సీసీటీవీ

## కెమెరాల ఏర్పాటు భద్రతకు అత్యంత కీలకం

● పోలీస్ కంట్రోల్ రూమ్‌తో అనుసంధానం ద్వారా వేగవంతమైన స్పందన సాధ్యం: జిల్లా ఎస్పీ జానకి





**మహబూబ్‌నగర్, జూన్ 18 ( సాక్ష్యం బ్యూరో ) :** ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి వ్యాపార సంస్థ, షాపింగ్ కాంప్లెక్స్, గోదాం, వాణిజ్య సముదాయాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి అవసరంగా మారిందని జిల్లా ఎస్పీ దరావత్ జానకి తెలిపారు. గురువారం మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓం కన్వెన్షన్ హాల్‌లో రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గాంధీ నాయక్ ఆధ్వర్యంలో వ్యాపారవేత్తలకు సీసీటీవీ కెమెరాలపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడారు. సీసీటీవీ కెమెరాలు నేరాల నివారణలో, నేరస్తులను గుర్తించడంలో, అనుమానాస్పద కదలికలను పర్యవేక్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆమె తెలిపారు. వ్యాపార సంస్థల్లో నాణ్యమైన కెమెరాలను సరైన స్టోరేజ్ సామర్థ్యంతో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వ్యాపారవేత్తలు తమ సీసీటీవీ వ్యవస్థలను మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్‌తో అనుసంధానం చేసుకోవచ్చని తెలిపారు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో పోలీసులు వేగంగా స్పందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌తో కూడా అనుసంధానం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. నగదు లావాదేవీలు జరిగే ప్రదేశాలు, ప్రవేశ ద్వారాలు, పార్కింగ్ ప్రాంతాలు వంటి కీలక ప్రాంతాల్లో తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యాపార సంస్థల భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా వ్యాపారవేత్తలు సీసీటీవీ అనుసంధానం, సాంకేతిక సదుపాయాలపై తమ అభిప్రాయాలు, సూచనలను ఎస్పీకి తెలియజేశారు. పోలీస్ శాఖ చేపడుతున్న భద్రతా చర్యలకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గాంధీ నాయక్, రూరల్ సబ్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, వ్యాపారవేత్తలు, వివిధ సంస్థల యజమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాలికలు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

● జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి



**మహబూబ్‌నగర్, జూన్ 18 ( సాక్ష్యం బ్యూరో ) :** జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఏనుగొండలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని సందర్శించి బడిబాట కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన బాలికా విద్య, కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ బాలబాలికల పుట్టుక నిష్పత్తిలో, అక్షరాస్యత శాతంలో ఇప్పటికీ వ్యత్యాసాలు ఉన్నందున ప్రభుత్వం బాలిక విద్యను ప్రోత్సహించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతోందన్నారు. విద్యార్థినులు చక్కగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఏ పనినైనా ఇష్టపడి చేస్తేనే అందులో విజయం సాధించగలమని, ఇతరుల సూచనల మేరకు కాకుండా తమ ఆసక్తి, అభిరుచులకు అనుగుణంగా కెరీర్‌ను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నేటి పోటీ ప్రపంచంలో కేవలం డిగ్రీలు మాత్రమే సరిపోవని, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. టెక్నాలజీ, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, తాజా పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో అధిగమించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నిరుత్సాహానికి లోనుకావద్దని విద్యార్థినులకు సూచించారు. ప్రభుత్వ కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. అర్హత కలిగిన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన బోధనతో పాటు భద్రత, రక్షణ కలిగిన వాతావరణంలో విద్య అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థినులు తమ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని, తల్లిదండ్రులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. లింగ వివక్షతను ఖండిస్తూ, బాలికల విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని పిలుపునిచ్చారు. అంతకుముందు జిల్లా విద్యాశాఖ అధికారి పాఠశాలలోని తరగతి గదులు, వంటగది, ప్రయోగశాల, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పాఠశాలలో ఉన్న విద్యా వాతావరణం, విద్యార్థినులు సాధించిన ఫలితాలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ స్పెషల్ ఆఫీసర్, సీఆర్‌టీలను, పీజీ సీఆర్‌టీలను అభినందించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష జీఈసీఓ అస్రా ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఆసుపత్రి వైద్య పరికరాల కొనుగోలుకు రూ.2.68 కోట్ల నిధులు





**నాగర్‌కర్నూల్ : జూన్ 18 (సాక్ష్యం)**
జిల్లా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నాగర్‌కర్నూల్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ తొలి సమీక్ష సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలు, మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాల అవసరాలు, భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి. ఉషారాణి ఆసుపత్రి ప్రస్తుత పరిస్థితి, రోగుల రద్దీ, అందుబాటులో ఉన్న వైద్య సేవలు, వివిధ విభాగాల్లో అవసరమైన ఆధునిక పరికరాలపై వివరాలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆధునిక వైద్య సేవలను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 2,68,79,383 నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఈ నిధులతో అత్యవసర వైద్య పరికరాలు, నిర్ధారణ యంత్రాలు, రోగుల చికిత్సకు అవసరమైన ఆధునిక ఎక్విప్‌మెంట్ కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. నిధుల వినియోగంలో పారదర్శకత పాటిస్తూ ఆసుపత్రిలో ఉన్న అత్యవసర అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి విభాగం నుంచి అవసరాల జాబితాను సేకరించి సాంకేతిక నివేదికలతో కూడిన సమగ్ర ప్రతిపాదనలు త్వరితగతిన సమర్పించాలని సూచించారు. జిల్లా ప్రజలు మెరుగైన వైద్య సేవ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అత్యవసర వైద్యం, నిర్ధారణ సేవలు, ప్రసూతి వైద్యం, శస్త్రచికిత్సలు, ఐసీయూ సేవలను బలోపేతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఆసుపత్రికి అంబులెన్స్ అవసరాన్ని సూపరింటెండెంట్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలోని అంబులెన్స్‌ను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు మరమ్మత్తుల కోసం అవసరమైన నిధులు అందజేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో నాగర్‌కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి. ఉషారాణి, జిల్లా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మహమ్మద్ దావూద్ సులేమాన్, వైద్యులు, అభివృద్ధి కమిటీ సభ్యులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

## పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

● ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్

**నాగర్‌కర్నూల్ : జూన్ 18 (సాక్ష్యం)**
విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ విధవ కార్పస్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఒక్కో కుటుంబానికి 99,800 చొప్పున ఆర్థిక సహాయం అందించారు. గురువారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పోలీసు వెల్ఫేర్ సొసైటీ ద్వారా ఈ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఈగలపెంట పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ ఎస్. బాలయ్య, లింగాల పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్సై ఎల్. శ్రీనివాసులు, పెద్దకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎం. మహేందర్ కుటుంబ సభ్యులకు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమం శాఖకు అత్యంత ప్రాధాన్యమైన అంశమని తెలిపారు. విధి నిర్వహణలో అంకితభావంతో సేవలందించిన సిబ్బంది కుటుంబాలకు అండగా నిలవడం శాఖ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు, ఏఓ కృష్ణయ్య, జిల్లా పోలీసు కోఆర్డినేటర్ గోలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.






# ఐపీఎల్ 2027 సీజన్‌ను ముందుకు జరిపే ఛాన్స్

## మార్చి 10 నుంచి మే 15 వరకు ముగింపు.. అవకాశాలు పరిశీలిస్తున్న బిసిసిఐ

వచ్చే ఐపీఎల్ సీజన్‌కు సంబంధించి కీలక విషయాలను బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు. ఐపీఎల్ 2027 సీజన్‌ను మార్చి 10 నుంచి మే 15 వరకు నిర్వహించేందుకు ఉ



న్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మ్యాచుల సంఖ్య పెంపు విషయంలో ప్రస్తుతం ఎలాంటి చర్చ జరగలేదని పేర్కొన్నారు. తాజా ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. ఎండల తీవ్రత వల్ల ఐపీఎల్ 20వ సీజన్‌ను ఇంకాస్త ముందుగా నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలిపారు. 'ఈ సంవత్సరం ఐపీఎల్ సీజన్ మార్చి 28 నుంచి మొదలై మే 31న ముగిసింది. మే 15 తర్వాత టోర్నీ కీలక దశకు చేరుకుంది. ఇలాంటప్పుడు పలుచోట్ల వర్షాలు పడే అవకాశమూ ఉంది. ఇక ఎండల తీవ్రత కూడా కొన్ని ప్రాంతాల్లో ఆందోళన కలిగించే అంశమే. ఇటు ప్లేయర్లతోపాటు అటు ప్రేక్షకులూ ఆటను ఆస్వాదించేందుకు ఇబ్బంది అవుతుంది. ఈక్రమంలో ఐపీఎల్ గవర్నింగ్ బాడీతో బీసీసీఐ చర్చలు జరుపుతోంది. లీగ్‌ను ఇంకాస్త ముందుగానే ప్రారంభిస్తే ఎలా ఉంటుందనే ఆలోచన చేస్తున్నాం. వచ్చే సీజన్ కోసం మార్చి 10 నుంచి మే 15 వరకు విండోను ఉంచాం. ప్లేఆఫ్స్, ఫైనల్‌కు వాతావరణం వల్ల ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలనేదే మా ఉద్దేశం. ఎండల తీవ్రత గురించి మాకు అభిమానుల నుంచి చాలా ఫిర్యాదులు వచ్చాయి. ఇటు ఆటగాళ్లూ ఇబ్బందులు పడ్డారు. కాబట్టి వారందరికీ మంచి వాతావరణం అందించాల్సిన బాధ్యత మాపై ఉందని సైకియా తెలిపారు. ఇకపోతే ఇప్పటికిప్పుడు మ్యాచుల సంఖ్య పెంపు విషయంలో నిర్ణయం తీసుకోలేం. చాలా అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. వివిధ దేశాల నుంచి ఆటగాళ్లు వస్తారు. దీనికోసం దాదాపు రెండు నెలల పాటు షెడ్యూల్‌ను కేటాయించాల్సి ఉంటుంది. కొందరు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండటం కష్టమవుతోంది. ఇతర దేశాలకూ ద్వైపాక్షిక సిరీస్‌లూ ఉంటాయి. ఇప్పటికైతే మ్యాచుల సంఖ్యను 74 నుంచి 94కు పెంచడంపై చర్చ జరగలేదు. భవిష్యత్తులో ఏం జరుగుతుందో ఇప్పుడే చెప్పలేమని దేవజిత్ సైకియా వెల్లడించారు.




## వైభవ్ సూర్యవంశీకి బిసిసిఐ ఆఫర్

### తల్లిదండ్రులతో ఇంగ్లడ్ పర్యటనకు అనుమతి

భారత క్రికెట్‌లో నయా సంచలనంగా ఎదుగుతున్న వైభవ్ సూర్యవంశీకి భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) ప్రత్యేక వెసులుబాటు కల్పించింది. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలకు ఎంపికైన ఈ యువ బ్యాటర్‌తో పాటు అతడి తల్లిదండ్రులనూ అనుమంతించింది. వారి ప్రయాణ, వసతి ఖర్చులన్నింటినీ తామే భరిస్తామని బీసీసీఐ స్పష్టం చేసింది. ఈ విషయాన్ని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా



ధ్రువీకరించారు. కేవలం 15 ఏళ్ల వయసులోనే జాతీయ జట్టులో చోటు దక్కించుకున్న వైభవ్.. సీనియర్ ఆటగాళ్ల మధ్య సౌకర్యంగా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామ న్నారు. 'జాతీయ జట్టులో 14-15 ఏళ్ల ఆటగాడు ఉండటం చాలా అరుదు. గతంలో సచిన్ టెండూల్కర్ లాంటి ఆటగాడు చిన్న వయసులోనే భారత జట్టులోకి వచ్చాడు. ఇప్పుడు వైభవ్ కూడా అలాంటి ప్రత్యేక పరిస్థితుల్లో ఉన్నాడు. అక్కడి కొత్త వాతావరణ పరిస్థితులకు అతడు అలవాటుపడేందుకు తల్లిదండ్రుల సాన్నిహిత్యం ఉపయోగపడుతుంది' అని సైకియా వివరించారు. ఐపీఎల్ సీజన్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన వైభవ్.. 776 పరుగులతో ఆరెంజ్ క్యాప్ సొంతం చేసుకున్నాడు. అంతేకాకుండా 237కు పైగా స్ట్రైక్రేట్‌తో బ్యాటింగ్ చేసి మోస్ట్ వ్యాల్యూబుల్ ప్లేయర్, ఎమర్జింగ్ ప్లేయర్ అవార్డులనూ సొంతం చేసుకున్నాడీ చిచ్చర పిడుగు. అతడి అద్భుత ఆటతీరును గుర్తించిన బీసీసీఐ.. భారత టీ20 జట్టులో అవకాశం కల్పించింది. కాగా.. దీనికంటే ముందు శ్రీలంకలో ప్రస్తుతం జరుగుతున్న ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత్-ఏ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నాడు వైభవ్.

### వన్డే ప్రపంచ కప్‌లో ఇషాన్‌కు చోటు ఖాయం

#### సునీల్ గవాస్కర్ ఆశాభావం

సౌతాఫ్రికా వేదికగా జరిగే 2027 వన్డే ప్రపంచ కప్ జట్టులో ఇషాన్ కిషన్ కచ్చితంగా చోటు దక్కించుకుంటాడని భారత మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ అభిప్రాయపడ్డారు. ఇషాన్‌ను ఇప్పుడు జట్టు నుంచి తప్పించడం దాదాపు అసాధ్యమని పేర్కొన్నారు. ప్రపంచ కప్‌నకు ఎంపిక కావడానికి ఇప్పటికే సరిపడా ప్రదర్శనను అతను చేశాడని చెప్పారు. 'ఇషాన్ కిషన్‌కు ఇప్పటికే దక్షిణాఫ్రికా వీసా వచ్చి ఉంటుందని నాకనిపిస్తోంది. అతడిని జట్టు నుంచి తప్పించాలంటే మరో ఆటగాడు అద్భుతమైన ప్రదర్శన చేయాల్సిందే. టీ20 ఫార్మాట్‌లో అతడు జట్టుకు ఎంతో కీలకమైన ఆటగాడు. పైగా చాలా బాగా బ్యాటింగ్ చేస్తున్నాడు. షాట్లు అద్భుతంగా ఆడుతున్నాడు. డిఫెన్స్ కూడా బాగుంది. బంతి షార్ట్‌గా వస్తే.. వెంటనే వెనక్కి జరిగి సిక్సర్లు కొడతాడు. గత ఏడాదిన్నర కాలంలో ఇషాన్ సంపూర్ణ ఆటగాడిగా మారాడు' అని గవాస్కర్ ప్రశంసలు కురిపించారు. ఇంగ్లాండ్ మాజీ స్పిన్నర్ గ్రేమ్ స్వాన్ కూడా ఇషాన్ బ్యాటింగ్‌కు ఫిదా అయ్యాడు. అతడు నిజమైన టీమ్ మ్యాన్. మూడో స్థానంలో బ్యాటింగ్ చేయమని అడిగితే మొదటి మ్యాచ్‌లోలాగే విలువైన ఇన్నింగ్స్ ఆడతాడు. రెండో వన్డేలో నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేస్తూ అద్భుతమైన దూకుడు ప్రదర్శించాడు. భారత జట్టు జెర్సీ ధరించి ఆడుతున్నంత కాలం ఏ స్థానంలో బ్యాటింగ్ చేస్తున్నాడనే దానితో సంబంధం ఉండదు. అది చాలా మంచి విషయం. ఎక్స్‌ట్రా కవర్ మీదుగా అతను కొట్టిన షాట్లు నాకు ఎంతగానో నచ్చాయని గ్రేమ్ స్వాన్ పేర్కొన్నాడు. అఎ÷-గానిస్థాన్‌తో జరిగిన రెండో వన్డేలో ఇషాన్ 79 బంతుల్లో 125 పరుగులు చేశాడు. అర్ధ శతకానికి 52 బంతులు తీసుకున్న అతను.. తర్వాత రెచ్చిపోయాడు. మరో 19 బంతులకే సెంచరీ మార్కును అందుకున్నాడు.

## బీహార్‌లో మరో చిచ్చర పిడుగు

### క్రికెట్‌లో అద్భుతంగా రాణించిన అక్షరగుప్తా

వైభవ్ సూర్యవంశీ 13 ఏళ్లకే ఐపీఎల్ కాంట్రాక్ట్ దక్కించుకుని క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేశాడు. బిహార్‌కు చెందిన ఈ కుర్రాడు రాజస్థాన్ రాయల్స్ తరఫున గత రెండు సీజన్లలో పరుగుల వరద పారించి ఎన్నో రికార్డులు బ్రేక్ చేశాడు. ఈ ప్రదర్శనతో భారత టీ20 జట్టులోనూ చోటు సంపాదించుకున్నాడు. ఇప్పుడు అదే రాష్ట్రం నుంచి మరో టీనేజీ సంచలనం వెలుగులోకి వచ్చింది. అక్షర గుప్తా అనే అమ్మాయి ఓ మ్యాచ్‌లో 126 బంతుల్లోనే 242.86 స్ట్రయిక్ రేట్‌తో 306 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. 16 బంతుల్లోనే హాఫ్ సెంచరీ, 34 బంతుల్లో సెంచరీ చేసింది. మొత్తం 55 ఫోర్లు, ఎనిమిది సిక్సర్లు బాది వార్తల్లో నిలిచింది. బిహార్ క్రికెట్ అసోసియేషన్ మహిళల అండర్-19 వన్డే ట్రోఫీ టోర్నమెంట్‌లో అక్షర గుప్తా ఈ సంచలన ఇన్నింగ్స్ నమోదు చేసింది. 15 ఏళ్ల అక్షర తూర్పు చంపారన్ జిల్లా రక్సాల్ అనే పట్టణంలో పుట్టి పెరిగింది. 14 ఏళ్ల వయసులోనే అండర్-19 మహిళల జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించింది. బిహార్ తరఫున రెండేళ్ల వ్యవధిలో వరుసగా నాలుగు బీసీసీఐ మహిళా టోర్నమెంట్లు ఆడిన తొలి మహిళా క్రికెటర్‌గా నిలిచింది. సంచలన ఇన్నింగ్స్ ఆడిన అక్షరకు బిహార్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు హర్షవర్ధన్ అభినందనలు తెలిపారు. బిహార్ మహిళా క్రికెటర్లు తమ ప్రదర్శనల ద్వారా రాష్ట్రానికి నిరంతరం కీర్తిని తెస్తున్నారని పేర్కొన్నారు. క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు



కల్పించేందుకు బీసీఏ నిరంతరం కృషి చేస్తోందని, ఇలాంటి ఇన్నింగ్స్‌లు యువ క్రికెటర్లకు స్ఫూర్తినిస్తాయన్నారు.

## కెనడాతో మ్యాచ్‌కు ఖతార్ ప్రభుత్వం బంపర్ ఆఫర్

ఫిఫా వరల్డ్‌కప్‌కు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. ప్రపంచంలో ఎక్కడున్నా సరే ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో ఒక్క మ్యాచ్ అయినా స్టేడియంలో లైవ్ చూడాలని అభిమానులు ఆరాటపడుతుంటారు. అందుకోసం చాలానే ఖర్చు చేస్తుంటారు. ఈ మ్యాచ్‌ల టికెట్లు వేలు, లక్షల్లో ఉన్నప్పటికీ అస్సలు వెనుకాడరు. తమ అభిమాన జట్టు, ఆటగాళ్లను మైదానంలో చూసి మురిసిపోతుంటారు. ప్రస్తుత టోర్నీలోనూ అదే పరిస్థితి



కనిపిస్తుంది. ఎక్కడెక్కడి నుంచో ఫిఫా మ్యాచ్‌లు జరుగుతున్న అమెరికా, కెనడా, మెక్సికో దేశాలకు సాకర్ ఫ్యాన్స్ పోటెత్తుతున్నారు. ఈ క్రమంలో ఖతార్ అభిమానుల కోసం ఆదే ప్రభుత్వం బంపర్ ఆఫర్ ప్రకటించింది. 1000 మంది అభిమానులకు ఉచితంగా ఫిఫా మ్యాచ్‌ను చూపించనుంది. 2026 ఫిఫాలో పెద్దగా అంచనాలు లేకుండా బరిలోకి దిగిన ఖతార్ తమ తొలి మ్యాచ్‌లో స్విట్జర్లాండ్‌తో అద్భుతంగా పోరాడింది. బలమైన స్విస్‌ను ధీటుగా ఎదుర్కొని ఒక గోల్ చేయడమే కాకుండా 1- 1తో మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. దీంతో వరల్డ్‌కప్ చరిత్రలో ఖతార్‌కు ఒక పాయింట్ వచ్చింది. ఇక ఈ టోర్నీలో ఖతార్ తమ రెండో మ్యాచ్‌కు సిద్ధమైంది. ఈ జట్టు ఇవాళ కెనడాను ఢీ కొట్టనుంది. ఈ మ్యాచ్‌కు కెనడా వాంకోవర్ లోని దీజ ప్లేస్ స్టేడియం వేదిక కానుంది. ఈ మ్యాచ్ భారత టైమ్ ప్రకారం జూన్ 19 ఉదయం 3.30 గంటలకు ప్రారంభం కానుంది. అయితే తొలి మ్యాచ్‌లో పోరాడిన తమ జట్టుకు మద్దతు ఇచ్చేందుకు ఖతార్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోని 1000 మంది ఫుట్‌బాల్ అభిమానులకు తమ జట్టుకు మద్దతుగా కెనడాకు పంపనుంది. వీళ్లను ప్రత్యేక విమానంలో వాంకోవర్‌కు పంపించనున్నట్లు తెలిసింది. వీళ్లకు అక్కడ హోటల్ బస, స్థానికంగా రవాణా, మ్యాచ్ టికెట్లు ఇవన్నింటీ ప్రభుత్వమే చూసుకుంటుంది. ఇందుకు అయ్యే పూర్తి ఖర్చును ప్రభుత్వం భరించనుంది. ఇక ఇప్పటికే అనేకమంది ఖతార్ అభిమానులు తమ సొంత ఖర్చులతో వాంకోవర్‌కు చేరుకున్నారు. కెనడాతో మ్యాచ్ కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. తమ సంప్రదాయ 'దర్బుకా' డ్రమ్‌లను వాయిస్తూ, ర్యాలీ నిర్వహించారు. ఇందులో ఉత్సాహంగా పాల్గొన్న అభిమానులు వాంకోవర్ నగర వీధుల్లో సందడి చేస్తున్నారు. స్టేడియం పరిసరాల్లో ఎరుపు రంగు దుస్తులు ధరించిన కెనడియన్ల కంటే ఖతార్ అభిమానులే అత్యధికంగా ఉన్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. భారీ సంఖ్యలో తమకు మద్దతు తెలిపేందుకు వచ్చిన అభిమానులకు ఖతార్ జట్టు కెప్టెన్ అబ్దుల్ అజీజ్ హాతేమ్ ధన్యవాదాలు తెలిపారు. 'అన్నింటికంటే ముందుగా, మా కోసం ఎంతో శ్రమ తీసుకుని ఇక్కడికి ప్రయాణం చేసిన ప్రతి ఒక్కరికీ నేను ధన్యవాదాలు చెప్పాలనుకుంటున్నా. మా బాధ్యత గురించి మాకు బాగా తెలుసు. మా అభిమానులు స్టేడియం నుంచి సంతోషంగా బయటకు వెళ్లేలా చేస్తాం. మమ్మల్ని చూసి వాళ్లు గర్వపడేలా చేయాల్సిందంతా చేస్తాం' అని అబ్దుల్ అన్నారు. 32 లక్షలమంది జనాభా ఉన్న ఖతార్ 2022లో ఫిఫా వరల్డ్‌కప్‌నకు ఆతిథ్యం ఇచ్చింది. అదే ఏడాది తొలిసారిగా ఈ ప్రపంచకప్‌లో ఎంట్రీ ఇచ్చింది. అయితే పసికూనగా బరిలోకి దిగిన ఆ టోర్నీలో ఖతార్ గ్రూప్ స్టేజ్‌లో అన్ని మ్యాచ్‌లు ఓడిపోయింది. దీంతో ఫిఫాకు ఆతిథ్యం ఇచ్చి గ్రూప్ స్టేజ్‌లో అన్ని మ్యాచ్‌లు ఓడిపోయిన జట్టుగా నిలిచింది. అయితే ఈసారి కాస్త మెరుగైన జట్టుతోనే వచ్చింది. ఈ టోర్నీలో ఇటీవల కాలిఫోర్నియాలోని శాంటా క్లారాలో స్విట్జర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌ను 1-1తో డ్రా చేసుకుంది.

## ఫిఫా ప్రపంచకప్ 2026లో పోర్చుగల్ జట్టుకు ఊహించని షాక్

### ఆధిక్యతను అడ్డుకున్న కాంగో జట్టు

ఫిఫా ప్రపంచకప్ 2026లో బలమైన పోర్చుగల్ జట్టుకు ఊహించని షాక్ తగిలింది. హ్యూస్టన్‌లోని ఎన్ఆర్జీ స్టేడియంలో జరిగిన గ్రూప్-కె మ్యాచ్‌లో డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో(డీఆర్ కాంగో) జట్టు 1-1తో పోర్చుగల్‌ను నిలువరించింది. మ్యాచ్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించినప్పటికీ, కాంగో పటిష్ఠ రక్షణ శ్రేణిని ఛేదించడంలో పోర్చుగల్ విఫలమైంది. మ్యాచ్ ప్రారంభమైన 6వ నిమిషంలోనే పోర్చుగల్ ఆటగాడు జోనో నెవ్స్ అద్భుతమైన ఫీల్డ్ గోల్‌తో జట్టుకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. అయితే, డిఫెండర్ విభాగాన్ని పటిష్ఠం చేసుకున్న కాంగో ఎదురుదాడికి దిగింది. ఈ క్రమంలో 44వ నిమిషంలో కాంగో స్టార్ యోనే విస్సా హెడర్ ద్వారా బంతిని నెట్‌లోకి పంపి స్కోరును 1-1తో సమం చేశాడు. రెండో అర్ధ భాగంలో పోర్చుగల్ బంతిని ఎక్కువసేపు తమ ఆధీనంలో ఉంచుకున్నప్పటికీ గోల్స్ చేయలేకపోయింది. ఈ మ్యాచ్ లో కాంగోపై గోల్‌తో పోర్చుగల్ యువ మిడ్‌ఫీల్డర్ జోవా నెవిస్ అరుదైన ఘనత సాధించాడు. ఫిఫా ప్రపంచకప్ చరిత్రలో గోల్ చేసిన మూడో అతి పిన్న వయస్కుడైన పోర్చుగీస్ ప్లేయర్‌గా నిలిచాడు. అతడు 21 ఏళ్ల 263 రోజుల వయసులో ఈ ఘనత సాధించాడు. అతడి కంటే ముందు ఈ జాబితాలో దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో(2006), రామోస్ (2022) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. మరోవైపు పోర్చుగల్ స్టార్ స్ట్రైకర్ క్రిస్టియానో రొనాల్డో ఈ మ్యాచ్‌లో పూర్తిగా నిరాశపరిచాడు. కాంగో డిఫెండర్లు అతడిని గట్టిగా మార్క్ చేయడంతో రొనాల్డోకు గోల్ చేసే అవకాశాలు దక్కలేదు. ఈ పేలవ ప్రదర్శనపై రొనాల్డో సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. 'మేము అనుకున్న ఆరంభం ఇది కాదు. కానీ ఇక్కడితో అంతా అయిపోలేదు. తల ఎత్తి తదుపరి మ్యాచ్‌పై దృష్టి పెడతాం' అంటూ అభిమానుల్లో నమ్మకాన్ని నింపాడు. మరో మ్యాచ్‌లో ఇంగ్లండ్ శుభారంభం చేసింది. గ్రూప్-ఎల్‌లో జరిగిన ఉత్కంఠభరిత పోరులో క్రొయేషియాపై 4-2తో విజయం సాధించింది. స్టార్ స్ట్రైకర్ హ్యారీ కేన్ రెండు గోల్స్‌తో మెరిసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.

# ఫిఫా వరల్డ్‌కప్‌లో ఘనా బోణీ

ఫిఫా వరల్డ్‌కప్‌లో ఘనా బోణీ కొట్టింది. తాజాగా టొరంటో స్టేడియం వేదికగా పనామాతో జరిగిన మ్యాచ్ లో 1-0 తేడాతో ఘనా జట్టు విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన ఈ పోరులో కాలేబ్ యిరెంకి చివరి నిమిషంలో గోల్ కొట్టడంతో ఘనా జట్టుకు విజయం ఖరారైంది. వాస్తవానికి మ్యాచ్ ఆరంభంలోనే పనామా జట్టుకు గోల్ సాధించే అవకాశం వచ్చింది. ఆ జట్టు ఆటగాడు అమీర్ మురిల్లో కొట్టిన షాట్‌తో బంతి క్రాస్, ఏరియాలో ఉన్న సెసిలియో వాటర్‌మన్‌కు చేరింది. కానీ ఆ గోల్‌ను ప్రత్యర్థి జట్టు ఘనా గోల్ కీపర్ లారెన్స్ అటి జిగీ ఆ బంతిని సమర్థంగా అడ్డుకున్నాడు. దీంతో పనామా తొలి గోల్ నమోదు చేసే ఛాన్స్ కోల్పోయింది. ఆ తర్వాత కూడా పనామాకు మరో అవకాశం లభించింది. అటి జిగీ సరిగ్గా పంచ్ చేయని బంతి జియోవనీ రామోస్ కాళ్ల వద్దకు చేరగా, డిఫెండర్‌కు సమయం దొరికినా అతను కొట్టిన షాట్ గోల్ పోస్ట్‌పైనుంచి వెళ్ళిపోయింది. దీంతో ఫస్టాఫ్‌లోనే రెండుసార్లు పనామాకు ఛాన్స్ మిస్ అయ్యింది. ఇక సెకండ్ హాఫ్‌లో ఘనాకు కూడా గోల్ అవకాశం మిస్సైంది. క్రిస్టియన్ మార్టినెజ్ కూడా గోల్ చేసేందుకు దగ్గరగా వచ్చాడు. కానీ అది సక్సెస్‌ఫుల్ కాలేదు. నెం.6 ఆటగాడు ఏరియాలో దొరికిన బంతిని అందుకుని షాట్ కొట్టాడు. కానీ అది సైడ్ నెట్లోకి వెళ్లింది. ఇలా మ్యాచ్



ఆద్యంతం హోరోహోరీగా సాగింది. చివరిదాకా ఏ జట్టు కూడా ఒక్క గోల్ నమోదు చేయలేదు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగుస్తుందని అంతా అనుకునేలోపే కాలేబ్ మార్ఫో యిరెంకీ అద్భుతమే చేశాడు. సునాయాసంగా గోల్ సాధించి ఘనాను విజేతగా నిలబెట్టాడు. యిరెంకీకి ఇది అంతర్జాతీయ కెరీర్‌లో తొలిగోల్ కావడం విశేషం. మరోవైపు గ్రూప్ కేలో జరిగిన మ్యాచ్‌తో కొలంబియా ఫిఫాలోకి గ్రాండ్ రీ ఎంట్రీ ఇచ్చింది. తాజాగా ఉజ్బెకిస్థాన్‌ను ఢీ కొట్టిన కొలంబియా 3-1 తేడాతో నెగ్గింది. దీంతో 8ఏళ్ల తర్వాత ఫిఫాలో ఆడుతున్న కొలంబియా గ్రాండ్ విక్టరీతో రీ ఎంట్రీ ఇచ్చినట్లైంది. ఆ జట్టు లూయిస్ డియాజ్ స్ఫూర్తిదాయక ప్రదర్శనతో తొలిసారిగా ప్రపంచ కప్‌లో ఆడుతున్న ఉజ్బెకిస్థాన్‌కు తొలి మ్యాచ్‌లోనే ఓటమి తప్పలేదు. మొదటి అర్ధభాగంలో డేనియల్ మునోజ్ చేసిన గోల్‌తో కొలంబియా ఖాతా తెరిచింది. అటు ఫస్టాఫ్‌లో ఉజ్బెకిస్థాన్‌కు గోల్ దక్కలేదు. దీంతో ఫస్టాఫ్‌ను 1-0తో ముగిసింది. ఆ తర్వాత రెండో అర్ధభాగంలో ఉజ్బెకిస్థాన్ ఆటగాడు ఉగ్లీ ఫైజుల్లావ్ 60వ నిమిషంలో అద్భుతమైన గోల్‌తో స్కోర్లు సమం అయ్యాయి. ఇది ఉజ్బెకిస్థాన్ జట్టుకు ఫిఫాలోతొలి గోల్. దీంతో ఆ జట్టు అభిమానులకు ఇదొక చిరస్మరణీయ క్షణంగా నిలిచింది. అయితే ఆ తర్వాత ఐదు నిమిషాల్లోనే డియాజ్ గోల్ సాధించడంతో మళ్లీ కొలంబియా లీడ్‌లోకి వెళ్లింది. అయినా ఉజ్బెకిస్థాన్ పట్టు వదలకుండా పోరాడింది. ఇక ఇంజ్యూరీ టైమ్ చివరి నిమిషాల్లో, కుచో హెర్నాండెజ్ కుడి వింగ్‌లో బంతిని సబ్స్టిట్యూట్ కాంపాజ్‌కు క్రాస్ చేయగా అతను హెడర్‌తో గోల్‌లోకి పంపించాడు. దీంతో కొలంబియా ఖాతాలో మూడు పాయింట్లు చేరాయి.



## #VenkyAnil5 & #NkrAR2 ఘనంగా ప్రారంభం

విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, 'హిట్ మెషీన్' అనిల్ రావిపూడి కలిసి ఒక పూర్తి స్థాయి పండుగ వినోదాత్మక చిత్రం (#VenkyAnil5 & #NkrAR2) అందించడానికి సిద్ధమవుతున్నారు. ఈ క్రేజీ కాంబినేషన్ చిత్రం 2027 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. కీర్తి సురేష్, కృతి శెట్టి ఇందులో కథానాయికలుగా నటిస్తున్నారు.

చిత్ర బృందం, పలువురు ప్రముఖ అతిథుల సమక్షంలో ఘనంగా జరిగిన ముహూర్తం, పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం అధికారికంగా ప్రారంభమైంది. దిల్ రాజు, శిరీష్ స్క్రిప్ట్‌ను దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటికి అధికారికంగా అందజేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ముహూర్తం సందర్భంగా, విక్టరీ వెంకటేష్, కళ్యాణ్ రామ్, కీర్తి సురేష్, కృతి శెట్టిలపై చిత్రీకరించిన మొదటి షాట్‌కు అల్లు అరవింద్ క్లాప్ కొట్టగా, సురేష్ బాబు కెమెరాను స్విచ్ ఆన్ చేశారు. దిగ్గజ దర్శకుడు కె. రాఘవేంద్ర రావు ఓపెనింగ్ షాట్‌కు దర్శకత్వం వహించారు. #VenkyAnil5 & #NkrAR2 చిత్రం అనిల్ రావిపూడి స్టయిల్ లో సాగే వినోదం, నవ్వులతో కూడిన సంక్రాంతి చిత్రంగా ఉండబోతోంది. వెంకటేష్, కళ్యాణ్ రామ్ కాంబో ఈ ప్రాజెక్ట్‌కు మరింత ఎట్రాక్షన్ జోడించడంతో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న పండుగ చిత్రాలలో ఒకటిగా ఇది నిలుస్తోంది. అనిల్ రావిపూడికి ఉన్న అద్భుతమైన బ్లాక్‌బస్టర్ ట్రాక్ రికార్డ్, స్టార్స్ కలయిక, పరిశ్రమలోని ప్రముఖ నిర్మాణ సంస్థల మద్దతు కారణంగా ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి అత్యుత్తమ సాంకేతిక బృందం పనిచేస్తోంది. ప్రముఖ సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ, తమ్మిరాజు ఎడిటింగ్, ఎ.ఎస్. ప్రకాష్ ఆర్ట్ డైరెక్షన్ నిర్వహిస్తున్నారు. ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

## "వెంకట్రామయ్య గారి తాలూకా" జులై లో విడుదల

దినేష్ కుమార్ హీరోగా, దివిజ ప్రభాకర్ (ఈటీవీ ప్రభాకర్ కుమార్తె) హీరోయిన్‌గా మురళీధర్ గౌడ్, సుధ టైటిల్ పాత్రలలో సతీష్ ఆవాల దర్శకత్వం లో కోమలి క్రియేషన్స్ బ్యానర్‌పై కోమలి మహేందర్ తొట్టె, సోమేష్ సారిపల్లి నిర్మించిన చిత్రం "వెంకట్రామయ్య గారి తాలూకా" ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని జూలై లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్ర నిర్మాత కోమలి మాట్లాడుతూ... నేను కోమలి ఫోక్ సింగర్ గా నా కంటూ ఒక గుర్తింపు తెచ్చుకుని సినిమా రంగం మీద నాకున్న ఇష్టం తో నేను సినిమా తీయాలి అని ఒక ధ్యేయం తో చాలా ఒడుదుడుకులని ఎదుర్కొని "వెంకట్రామయ్య గారి తాలూకా" చిత్రాన్ని పూర్తి చేసాము. ఈ సినిమా మొదలయినప్పటి నుండి ఇప్పటివరకు నేను పడిన కష్టం పడిన మాటలు కంటినిండా నిద్ర కూడా పట్టేది కాదు అన్ని కష్టాలు ఎదుర్కొని జులై లో మూవీ విడుదల చెయ్యడానికి రెడీ చేస్తున్నాము. మా సినిమాకి మీడియా సపోర్ట్ ఉండాలి అని కోరుకుంటున్నాను అని కోమలి తెలిపారు. దర్శకుడు సతీష్ అవాల మాట్లాడుతూ.. మా "వెంకట్రామయ్య గారి తాలూకా" చిత్రన్ని జులై లో విడుదల కానుండి త్వరలోనే డేట్ ఫైనల్ చేసి ఆపిషియల్ ప్రెస్ మీట్ పెట్టి అనౌన్స్ చేస్తాము. మా కథ విషయానికోస్తే అందమైన ఒక పల్లెటూరు లో వెంకట్రమయ్య అనే పరువుగల కుటుంబం లోజరిగే ప్రస్తుతం మనుషుల మధ్య ఉన్న బంధాలు డబ్బు తో ముడిపడ్డాయి. మానవీయ సంబంధాలు అన్ని ఆర్థిక సంబంధాలు గా మారిపోయాయి. తల్లి తల్లిదండ్రులు వాళ్ళ పిల్లలను కడుపు కట్టుకుని ఎన్నో కష్టాలను భరిస్తూ పిల్లలను ఎంతో అల్లారు ముద్దగా నలుగురు పిల్లలను పెంచి పెద్ద చేస్తున్నారు. కానీ తల్లి తల్లిదండ్రుల చివరి దశలో




నలుగురు పిల్లలు కలిసి వాళ్ళని పెంచలేకపోతున్నారు. తల్లి తల్లిదండ్రుల గొప్పతనం తెలియచేసే సినిమా. "వెంకట్రామయ్య గారి తాలూకా" మంచి ఫ్యామిలీ డ్రామాని కుటుంబం తో కలిసి థియేటర్ కి వెళ్లి హాయిగా ఎంజాయ్ చేసేలా చిత్రాన్ని తెరకేకించాం అని దర్శకుడు సతీష్ ఆవాల తెలిపారు.

## థియేటర్లలో పెద్ది..రీలోడెడ్ వర్షన్

**మరో ఆరు నిముషాల అదనపు దృశ్యాలు జోడింపు**


మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న 'పెద్ది' సినిమాకు సంబంధించి మేకర్స్ క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా ఇప్పుడు సరికొత్త 'రీలోడెడ్ వెర్షన్'తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దాదాపు 5 నిమిషాల 56 సెకన్ల నిడివి గల అదనపు దృశ్యాలను జోడించి నేటి నుంచి థియేటర్లలో ప్రదర్శించనున్నట్లు చిత్రబృందం




అధికారికంగా ప్రకటించింది. ఈ కొత్త ఫుటేజ్‌లో కథానాయిక జాన్వీ కపూర్‌కు సంబంధించిన ఎమోషనల్ సీన్స్‌తో పాటు, సీనియర్ నటుడు జగపతి బాబు నటించిన కీలకమైన సన్నివేశం కూడా ఉండటం విశేషం. ఈ అదనపు ఐదున్నర నిమిషాల సీన్స్ సినిమా ఎమోషన్‌ను, డ్రామాను మరో స్థాయికి తీసుకెళ్తాయని మేకర్స్ చెబుతున్నారు. ఇప్పటికే థియేటర్లలో సందడి చేస్తున్న 'పెద్ది'కి ఈ రీలోడెడ్ వెర్షన్ మరింత బూస్ట్ ఇస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రంలో కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ వంటి పాన్ ఇండియా తారాగణం కీలక పాత్రల్లో మెరిశారు. ఏఆర్ రెహమాన్ సంగీతం, రత్నవేలు సినిమాటోగ్రఫీ సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. ఇప్పటికే మాస్, ఫ్యామిలీ ఆడియెన్స్‌ను ఆకట్టుకున్న 'పెద్ది'.. కొత్త సీన్ల జోడింపుతో బాక్సాఫీస్ వద్ద మరిన్ని రికార్డులు బద్దలు కొడుతుందా అనేది ఆసక్తిగా మారింది. థియేటర్లలో 'పెద్ది' రీలోడెడ్ వెర్షన్‌ను మిస్ అవ్వొద్దని చిత్రయూనిట్ మెగా ఫ్యాన్స్‌కు పిలుపునిచ్చింది.

## ఇండియా స్టోరీ పోస్టర్ విడుదల

బాలీవుడ్ నటులు కాజల్ అగర్వాల్, శ్రేయాస్ తల్పడే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న పాన్ ఇండియా సోషియో నేషనల్ డ్రామా 'ది ఇండియా స్టోరీ' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ తాజాగా



విడుదల చేశారు. జీ స్టూడియోస్ సమర్పణలో ఎంఐజీ ప్రొడక్షన్స్ / స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి చెత్తన్ డీకే దర్శకత్వం వహిస్తుండగా, సాగర్ బి. షిండే కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సుమిత్ బగడే, అనితా జాదవ్, వినాయక్ సైదానీ, కల్పేష్ షా, దేవయాని ఖోరటే, ప్రేమ్ జోషి ఈ చిత్రానికి సహ నిర్మాతలుగా ఉన్నారు. దేశంలో తీవ్రమవుతున్న ఆహార కల్తీ, వ్యవసాయంలో రసాయనాలు, పురుగుమందుల మితిమీరిన వాడకం వెనుక ఉన్న కుంభకోణాల చుట్టూ ఈ చిత్ర కథ సాగనుంది. బాంబే హైకోర్టు నేపథ్యంలో గ్రిప్పింగ్ కోర్టు రూమ్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో కాజల్ అగర్వాల్ పవర్‌ఫుల్ లాయర్ పాత్రలో, శ్రేయాస్ తల్పడే ఆందోళనలో ఉన్న తండ్రి పాత్రలో కనిపించనున్నారు. జీ స్టూడియోస్ ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్న 'ది ఇండియా స్టోరీ' 2026 జూలై 24న హిందీ, తమిళం, తెలుగు భాషల్లో గ్రాండ్‌గా థియేటర్లలోకి రానుంది.

## 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' చిత్రంలో క్లైమాక్స్ ట్విస్ట్ అద్భుతంగా అనిపిస్తుంది

### హీరోయిన్ రాశీ సింగ్

వడ్డే జిష్ణు సమర్పణలో వడ్డే క్రియేషన్స్ బ్యానర్ మీద వడ్డే నవీన్ హీరోగా, నిర్మాతగా చేసిన చిత్రం 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు'. ఈ మూవీతో కమల్ తేజ నార్ల దర్శకుడిగా పరిచయం కాబోతోన్నారు. ఈ సినిమాలో వడ్డే నవీన్‌కి జోడిగా రాశీ సింగ్ నటించారు. ఈ చిత్రం జూన్ 19న రిలీజ్ కాబోతోంది. ఈ క్రమంలో గురువారం నాడు హీరోయిన్ రాశీ సింగ్ మీడియాతో ముచ్చటించారు. ఆమె చెప్పిన విశేషాలివే..

**'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' చిత్రంలో మీ పాత్ర ఎలా ఉండబోతోంది?**

పక్కింటి అమ్మాయిలా నా పాత్ర ఉంటుంది. ఎంతో సహజంగా అనిపిస్తుంది. విత్ అవుట్ మేకప్ నటించాను. చాలా వరకు నేచురల్‌గానే కనిపిస్తాను. ఇందులో కంప్లీట్ మదర్ పాత్రలా ఉండదు. ఫ్యామిలీ చుట్టూ తిరిగే కథ ఇది.



**వడ్డే నవీన్ గారి గురించి ముందు ఏమైనా తెలుసుకున్నారా?**

వడ్డే నవీన్ గారితో సినిమా అని తెలిశాక చాలా వరకు ఆయన గురించి రీసెర్చ్ చేశాను. ఆయన నటించిన ఎన్నో చిత్రాల గురించి తెలుసుకున్నాను. ఎందుకు ఇంత గ్యాప్ ఇచ్చారు అని అందరి కంటే ముందుగా నేను ఆయన్ను అడిగాను (నవ్వుతూ).

**'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' చిత్రంలో మీ పాత్ర ఎలాంటి టర్నింగ్ పాయింట్‌లా ఉంటుంది?**

భర్తకు ప్రతీ విషయంలో సపోర్ట్‌గా ఉండే ఓ చక్కటి గృహిణిగా లక్ష్మీ పాత్ర ఉంటుంది. నేను రియల్ లైఫ్‌లో కంప్లీట్ డిఫరెంట్‌గా ఉంటాను. లక్ష్మీ పాత్రను పోషించడం ఆనందంగా ఉంది. ఈ ట్రాన్స్‌ఫర్స్ విషయంలో లక్ష్మీ అనే కారెక్టర్ ఎప్పుడూ ప్రిపేర్ అయి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో చిరాకు పడినా కూడా భర్తకు ఎప్పుడూ అండగానే ఉంటుంది. నా కెరీర్‌లో ఇదొక డిఫరెంట్ పాత్ర అవుతుంది.

**దర్శకుడితో వర్క్ ఎక్స్‌పీరియెన్స్ గురించి చెప్పండి?**

కమల్ గారికి ఫుల్ క్లారిటీ ఉంటుంది. ఆయనకు ఏం కావాలో అది వచ్చే వరకు ప్రయత్నిస్తూనే ఉంటారు. లక్ష్మీ ఎలా ఉండాలో.. అలానే ఉండాలని ఆయన చెబుతుంటారు. కొంచెం అటూ ఇటూ కూడా కావొద్దు అని ఆయన అంటుంటారు. ఆయనకు ప్రతీ క్రాఫ్ట్ మీద క్లారిటీ ఉంది. ఆయనతో జర్నీ చాలా స్మూత్‌గా సాగింది.

**వడ్డే నవీన్ గారితో వర్క్ ఎక్స్‌పీరియెన్స్ గురించి చెప్పండి?**

వడ్డే నవీన్ గారు చాలా ఇంటలెక్చువల్. ఆయనకు వరల్డ్ నాలెడ్జ్ ఎక్కువగా ఉంటుంది. ప్రపంచంలో ఏ విషయం గురించి అడిగినా బోలెడంత సమాచారం ఇస్తారు. కానీ సోషల్ మీడియా, ఇన్ స్టాగ్రాం అంటే మాత్రం పారిపోతారు. ఆయకు ఇన్ స్టా అకౌంట్ ఓపెన్ చేయించాలని చాలా ప్రయత్నించాను.

**రెస్టారెంట్ బిజినెస్ ఎలా నడుస్తోంది?**

రెస్టారెంట్ బిజినెస్ అద్భుతంగా నడుస్తోంది. వడ్డే నవీన్ గారు కూడా నా వ్యాపకాల గురించి అడిగేవారు. నాకున్న రెస్టారెంట్, కెఫె వ్యాపారాల గురించి చెప్తే ఆశ్చర్యపోయారు. నాకు ఫుడ్, కాఫీ అంటే చాలా ఇష్టం. అందుకే ఆ బిజినెస్ పెట్టాను. నా బ్రదర్ హోటల్ మేనేజ్మెంట్ చేశారు. అతని సలహాలు కూడా తీసుకున్నాను.

**మీకు ఏ రంగంలో కంఫర్ట్‌గా అనిపిస్తుంది?**

నాకు సినిమాలు, వ్యాపారాలు రెండూ ఇష్టం. నేను ఇంకా ఇంకా చాలా చేయాల్సి ఉంది. ఇదంతా కూడా నథింగ్. 14 ఏళ్లకే మోడలింగ్ స్టార్ట్ చేశా. ఛత్తీస్‌ఘడ్‌లోని భిలాయ్ నుంచి వచ్చాను. మిస్ చత్తీస్ ఘడ్ పోటీలో రెండో స్థానంలో వచ్చాను. పేపర్‌లో నా ఫోటో చూసి ఆ విషయం మా ఇంట్లో వాళ్లకి తెలిసింది. నాకు చదువుల్లో అంతగా ఆసక్తి ఉండేది కాదు. అలా మెల్లిగా ఎయిర్ హోస్టెస్‌గా కెరీర్ ప్రారంభించాను. ఇప్పుడు సినిమాలు, వ్యాపారాల్లో బిజీగా ఉన్నాను.

**ప్రస్తుతం చేస్తున్న ప్రాజెక్ట్‌లు ఏంటి?**

'గాసిప్' అని ఓ ప్రాజెక్ట్ ఓటీటీ కోసం చేశాను. ఇంకా కొన్ని ప్రాజెక్టులు చర్చల దశల్లో ఉన్నాయి. రకరకాల పాత్రలు, డిఫరెంట్ కంటెంట్ ఉన్న చిత్రాల్ని చేయాలని చూస్తున్నాను. గ్లామర్ అయినా పర్ఫామెన్స్ ఓరియెంటెడ్ అయినా సరే నేను నటించేందుకు సిద్దంగానే ఉన్నాను.

**'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' సినిమా చూశారా?**

షూటింగ్ టైంలో నాకు పూర్తి కథ తెలీదు. నా సీన్స్ వరకే కథను చెప్పారు. ఈ చిత్రాన్ని చూసిన తరువాత ఆశ్చర్యపోయాను. నవీన్ గారు చాలా సర్ ప్రైజ్ చేస్తారు. నా పాత్ర తెరపై చక్కగా అనిపించింది. వంద శాతం న్యాయం చేశానని అనిపిస్తుంది. క్లైమాక్స్ ట్విస్ట్ చూశాక సినిమా అద్భుతంగా అనిపించింది. ఇదొక మంచి చిత్రంగా నిలుస్తుంది.









Published ,printed and owend by Sudheer Kumar Katepally printed at Sree sesha Sai enterprises , plot no .98/part 1,co-operative industrial estate phase-II, Gandhi nagar Hyderabad,Medchal Malkajgiri , Telangana-500037. Published at 6-3-553,Flat no .G2, CLassic Court Ane A, opp:NKM Grand hotel, Erramanzil Colony, Somajiguda, Hyderabad, Telangana-500082.Editor : Sudheer kumar katepally ph: 9000657700 PRGI NO: TGTEL/26/A2380